

ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:124 | ఎడిటర్: మేనం శ్యామ్ | బుధవారం 25-11-2026 | పేజీలు: 13

సిరా చుక్క

రైతే దేశానికి నిజమైన హీరో..
అతని చెమట చుక్కే
దేశానికి అన్నం పెట్టే గింజ!
ఓట్ల కోసం రైతన్నను
వాడుకునే పాలకులారా..
అతని కష్టాలు మీ కళ్లకు
కనిపించవా?
పంట పండితే
గిట్టుబాటు ధర లేదు..
పంట పండకపోతే ఆదుకునే
దిక్కు లేదు..
అప్పుల ఊబిలో చిక్కుకున్న
అన్నదాతకు చివరికి కన్నీళ్లే
మిగులుతున్నాయి!
రైతును గౌరవించని పాలనకు..
ప్రజలే చెప్పాలి తగిన బుద్ధి!
రైతు బతికితేనే దేశం బతుకుతుంది..
రైతు సంతోషమే దేశానికి సౌభాగ్యం..
అన్నదాత అభివృద్ధే దేశాభివృద్ధి!
ఇదే నిజం.. ఇదే సిద్ధాంతం!

అరుణ్ రెడ్డి పన్నాల..
వికారాబాద్ జిల్లా బ్యూరో



మూసీ ప్రాజెక్టుపై సీఎం స్పెషల్ ఫోకస్

- జనవరి 2027లో పనులు ప్రారంభం!
- మూసీ పునరుజ్జీవం ఫేజ్-1 పనులకు ఏర్పాట్లు
- హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు జోన్-1ఏ
- ఉస్మాన్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు జోన్-1బీ
- మిరాలం చెరువు అభివృద్ధి, పూడిక తొలగింపునకు ఆదేశాలు
- మార్చి 2027 నాటికి ఆధునిక గోశాల పూర్తి చేయాలని సూచన

ప్రజా వాయిస్, హైదరాబాద్: మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు పనులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచడంతో పాటు నిర్దిష్ట గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంసీహెచ్ఆర్డీలో మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్ల పురోగతి, పట్టణాభివృద్ధిపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫేజ్-1 పనుల పురోగతి, భూసేకరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.



రెండు జోన్లుగా ఫేజ్-1 పనులు

మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు ఫేజ్-1లో భాగంగా హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.20 కిలోమీటర్ల ప్రాంతాన్ని జోన్-1ఏగా, ఉస్మాన్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్ల ప్రాంతాన్ని జోన్-1బీగా విభజించి పనులు చేపట్టనున్నట్లు అధికారులు వివరించారు. జనవరి 2027లో పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఫేజ్-1 టెండర్ల ప్రక్రియ ప్రారంభించినట్లు వెల్లడించారు.

మిరాలం చెరువు పూడిక తొలగింపునకు ఆదేశం

మిరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల పురోగతిపై సీఎం ఆరా తీశారు. జనవరి 2028 నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు అధికారులు తెలిపారు. చెరువు అభివృద్ధితో పాటు ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన పూడికను కూడా తొలగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

రేడియల్ రోడ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

రేడియల్ రోడ్ల నిర్మాణం, భూసేకరణ పురోగతిపై అధికారులు సీఎంకు వివరించారు. ఈ పనుల్లో మరింత వేగం పెంచాలని రేవంత్‌రెడ్డి సూచించారు. గండిపేట వద్ద నిర్మిస్తున్న ఆధునిక గోశాల పనులపైనా సమీక్షించారు. మార్చి 2027 నాటికి నిర్మాణం పూర్తి చేసేలా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.


పట్టణాభివృద్ధిపై సమీక్ష

మూసీ ప్రాజెక్టుతో పాటు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి అంశాలపైనా సీఎం ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సెక్రటరీ మాణిక్‌రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, సీఎంసీ కమిషనర్ శ్రీజన, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక, హెచ్ఎండీబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ అశోక్‌రెడ్డి, ఎండీసీఎల్ ఎండీ నర్సింహారెడ్డి, హెచ్‌జీసీఎల్ ఎండీ ఉపేందర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్కూల్ పిక్నిక్‌లో విషాదం

- ఇనుప ఊయల తగిలి పదేళ్ల బాలుడు మృతి!
- మొయినాబాద్ లోటస్ పాండ్ పార్క్‌లో ఘోర ప్రమాదం
- హ్యాపీ స్కాలర్స్ స్కూల్ విద్యార్థుల పిక్నిక్‌లో ఘటన
- ఇనుప ఊయల ఢీకొని అభిరామ్ అనే బాలుడు మృతి
- మరో విద్యార్థి యశ్వంత్‌కు తీవ్ర గాయాలు
- పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ

2 లో



చేతబడి, పూజల పేరుతో డబ్బు రెట్టింపు మోసం

- నలుగురు అరెస్ట్!
- 'చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' పేరుతో నకిలీ నోట్ల కట్టలు
- రూ.6.50 లక్షలు రెట్టింపు చేస్తామని నమ్మించి రూ.8 లక్షలు కాజేత
- రూ.40 లక్షల విలువైన 99 నకిలీ నోట్ల కట్టలు స్వాధీనం
- 100 నకిలీ బంగారు నాణేలు, మూడు మొబైల్ ఫోన్లు సీజ్
- ముఠా చేతిలో సుమారు 40 మంది మోసపోయి ఉండొచ్చని పోలీసుల అనుమానం

ప్రజా వాయిస్, ఆదిలాబాద్: చేతబడి, ప్రత్యేక పూజల పేరుతో డబ్బును రెట్టింపు చేస్తామంటూ ప్రజలను మోసం చేస్తున్న ముఠా గుట్టును ఆదిలాబాద్ పోలీసులు రట్టు చేశారు. బాధితుల నుంచి అసలు నగదును తీసుకుని, వాటి స్థానంలో 'చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' పేరుతో ముద్రించిన నకిలీ నోట్ల కట్టలను ఇస్తూ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఈ కేసులో నలుగురిని అరెస్ట్ చేసి, రూ.40 లక్షలకు పైగా ముఖ విలువ కలిగిన 99 నకిలీ నోట్ల కట్టలు, 100 నకిలీ బంగారు నాణేలు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు.



రూ.6.50 లక్షలకు రూ.13 లక్షల ఆశ..

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన రాములును ప్రధాన నిందితుడు అత్తం పరశురాం 2023 నవంబర్‌లో సంప్రదించాడు. ప్రత్యేక పూజలు, చేతబడి ద్వారా రూ.6.50 లక్షలను రూ.13 లక్షలుగా రెట్టింపు చేసి ఇస్తానని నమ్మించాడు. దీంతో రాములు అదే ఏడాది నవంబర్ 10న షాపూర్ గ్రామ శివారులో పరశురాంకు రూ.6.50 లక్షలు అందజేశాడు.అనంతరం ఓ వ్యవసాయ క్షేత్రంలో సుమారు 15 నిమిషాల పాటు పూజలు నిర్వహించిన పరశురాం.. ఓ బ్యాగును రాములుకు ఇచ్చాడు. దాన్ని వెంటనే తెరవకుండా పది రోజుల తర్వాతే తెరవాలని సూచించాడు. అతడి మాటలు నమ్మిన బాధితుడు పది రోజుల తర్వాత బ్యాగు తెరిచి చూడగా.. అందులో అసలు కరెన్సీకి బదులుగా 'చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' పేరుతో ముద్రించిన నకిలీ నోట్లు, తెల్ల కాగితాలు కనిపించాయి.

మరోసారి పూజల పేరుతో వసూళ్లు

బ్యాగులో నకిలీ నోట్లు ఉన్నాయని రాములు ప్రశ్నించగా.. అతడి ఇంట్లో దుష్ట ప్రభావాలు ఉన్నాయని పరశురాం మరో కథ అల్లినట్లు పోలీసులు తెలిపారు. ఆ ప్రభావాలను తొలగించేందుకు మరిన్ని పూజలు చేయాలని నమ్మించి మరోసారి రూ.50 వేలు, ఆ తర్వాత రూ.లక్ష వసూలు చేశాడని వెల్లడించారు. ఇలా మొత్తం

మిగతా 2లో

కవితపై వ్యాఖ్యలు పొరపాటే

- విచారం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క
- తన వ్యాఖ్యల్లో తప్పు దొర్లిందని అంగీకారం
- కవిత మాటలను ప్రస్తావించే క్రమంలో పొరపాటు జరిగిందని వివరణ
- 'క్యాన్సర్'కు బదులుగా 'ఎయిడ్స్' పదం వాడానని వెల్లడి
- వీడియోను వైరల్ చేస్తూ బీఆర్ఎస్ ట్రోలింగ్ చేస్తోందని ఆగ్రహం
- రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలు తన నైజం కాదని స్పష్టీకరణ

2 లో



గ్రీన్ ట్యాంకర్లలో నాలా మురుగు నీరా?

- ఖాజాగూడలో కలకలం!
- జలమండలి గ్రీన్ ట్యాంకర్ల సేవలపై తీవ్ర ఆరోపణలు
- ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటికి బదులుగా నాలా నీరు నింపుతున్నారంటూ ఫిర్యాదులు
- ఖాజాగూడ మెయిన్‌రోడ్డులో వెలుగులోకి వచ్చిన దృశ్యాలు
- విచారణ చేపట్టిన జలమండలి, సైబరాబాద్ మున్సిపల్ అధికారులు
- నీటి సేకరణ, నాణ్యత పరీక్షలపై స్థానికుల అనుమానాలు



గ్రీన్ ట్యాంకర్ల లక్ష్యం ఇదీ..

తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించకుండా ఆదా చేయడం, శుద్ధి చేసిన మురుగు నీటిని ప్రత్యామ్నాయ అవసరాలకు ఉపయోగించడం కోసం జలమండలి గ్రీన్ ట్యాంకర్ల విధానాన్ని తీసుకొచ్చింది. ఈ సేవలను ఈ నెల 1వ తేదీన అధికారికంగా ప్రారంభించింది. మురుగు నీటి శుద్ధి కేంద్రాలైన ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని ట్యాంకర్ల ద్వారా గార్డెనింగ్, ల్యాండ్‌స్కేపింగ్, నిర్మాణ పనులకు సరఫరా చేయాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం.

నాలా నుంచి నేరుగా ట్యాంకర్‌లోకి?

ప్రజా వాయిస్, హైదరాబాద్:తాగునీటి వృథాను అరికట్టడంతో పాటు మురుగు నీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో జలమండలి ప్రారంభించిన గ్రీన్ ట్యాంకర్ల సేవలపై వివాదం నెలకొంది. గార్డెనింగ్, ల్యాండ్‌స్కేపింగ్, నిర్మాణ పనుల అవసరాలకు ఎస్టీపీల్లో శుద్ధి చేసిన మురుగు నీటిని సరఫరా చేయాల్సి ఉండగా.. ఖాజాగూడలో మాత్రం నేరుగా నాలాలో ప్రవహిస్తున్న మురుగు నీటిని ట్యాంకర్లలో నింపుతున్నారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంపై జలమండలి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు విచారణ చేపట్టారు.


అయితే ఖాజాగూడ మెయిన్‌రోడ్డులోని ఓ నాలా నుంచి ఎలాంటి శుద్ధి ప్రక్రియ లేకుండానే మురుగు నీటిని గ్రీన్ ట్యాంకర్‌లోకి నింపుతున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో స్థానికులు

మిగతా 2లో

హైదరాబాద్‌కు సింగూరు నీటి సరఫరాకు బ్రేక్?

- డిసెంబర్ 20 తర్వాత గోదావరే దిక్కు!
- సింగూరు జలాశయంలో అడుగంటుతున్న నీటి నిల్వలు
- ప్రస్తుతం అందుబాటులో 1.95 నుంచి 1.99 టీఎంసీల నీరు మాత్రమే
- డిసెంబర్ 20 తర్వాత సరఫరా నిలిచిపోయే అవకాశం
- ప్రత్యామ్నాయంగా 40 ఎంజీడీల గోదావరి జలాల తరలింపునకు ఏర్పాట్లు
- మల్లన్నసాగర్–ఘన్‌పూర్ పైప్‌లైన్ పనులు తుది దశకు

2 లో



డ్రగ్స్ రహిత దేశ నిర్మాణం ప్రతి పౌరుడి బాధ్యత

- కిషన్‌రెడ్డి
- నషా ముక్త భారత్ కార్యక్రమానికి హైదరాబాద్ వేదిక
- డ్రగ్స్ మహమ్మారితో దేశ ఉనికికే ముప్పు
- ప్రధాని మోదీ లక్ష్యంతో కార్యక్రమం ప్రారంభం
- రాజకీయాలకు అతీతంగా డ్రగ్స్‌పై పోరాడాలని పిలుపు
- డ్రగ్స్ రహిత హైదరాబాద్, తెలంగాణ నిర్మాణమే లక్ష్యం



ప్రజా వాయిస్, హైదరాబాద్: డ్రగ్స్ మహమ్మారితో దేశ ఉనికికే ముప్పు పొంచి ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హెచ్చరించారు. డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణ లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'నషా ముక్త భారత్' కార్యక్రమానికి బుధవారం హైదరాబాద్ వేదిక కానుందని వెల్లడించారు. ఇది కేవలం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన కార్యక్రమం కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు.మంగళవారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతి మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడిన కిషన్‌రెడ్డి.. డ్రగ్స్ సమస్య దేశ ప్రజల భవిష్యత్తు, ఉనికికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. డ్రగ్స్ బారినపడి పంజాబ్ రాష్ట్రం ఉనికికే ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డ్రగ్స్ తీసుకునే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా డ్రగ్స్‌పై సమర్థవంతంగా పోరాడాలని సూచించారు. రాజకీయాల గురించి తర్వాత మాట్లాడుకుందామని, ప్రస్తుతం రాజకీయాలకు అతీతంగా అందరూ ఒక్కటై ఈ మహమ్మారిని అరికట్టాలని పిలుపునిచ్చారు.డ్రగ్స్ రహిత హైదరాబాద్, డ్రగ్స్ రహిత తెలంగాణతో పాటు డ్రగ్స్ రహిత దేశాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కిషన్‌రెడ్డి కోరారు.



స్కూల్ పిక్నిక్‌లో విషాదం

ప్రజా వాయిస్, హైదరాబాద్:ఎంతో సరదాగా, ఉత్సాహంగా సాగుతున్న స్కూల్ పిక్నిక్‌లో ఒక్కసారిగా విషాదం చోటుచేసుకుంది. సంతోషంగా గడిపేందుకు వెళ్లిన విద్యార్థులపై అనుకోని ప్రమాదం విరుచుకుపడింది. ఇనుప ఊయల తగిలి పదేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోగా.. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్ శివారులోని మొయినాబాద్ లోటస్ పాండ్ పార్క్‌లో ఈ ఘటన జరిగింది. పిక్నిక్‌కు వెళ్లిన కుమారుడు విగతజీవిగా తిరిగిరావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఊయల అదుపుతప్పి చిన్నారులపైకి..

హైదరాబాద్‌లోని హ్యాపీ స్కాలర్స్ స్కూల్ యాజమాన్యం విద్యార్థులను పిక్నిక్ కోసం మొయినాబాద్‌లోని లోటస్ పాండ్ పార్క్‌కు తీసుకెళ్లింది. అక్కడ ఉన్న భారీ ఇనుప ఊయలపై సుమారు పది మంది విద్యార్థులు ఎక్కారు. మరో నలుగురు విద్యార్థులు వెనుక నుంచి ఊయలను వేగంగా ఊపుతూ ఆడుకున్నారు. ఈ క్రమంలో ఊయల ఒక్కసారిగా అదుపుతప్పి వేగంగా వెనక్కి దూసుకొచ్చింది. అక్కడే ఉన్న ఇద్దరు చిన్నారులను బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో అభిరామ్ అనే పదేళ్ల బాలుడు అక్కడికక్కడే మృతిచెందగా.. యశ్వంత్ అనే మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

టీచర్లు, సిబ్బంది పర్యవేక్షణ ఏదీ?

భారీ ఇనుప ఊయలపై పది మంది విద్యార్థులు ఉండగా, మరో నలుగురు దాన్ని వేగంగా ఊపుతున్న సమయంలో అక్కడ ఉపాధ్యాయులు లేదా పాఠశాల సిబ్బంది లేకపోవడమే ప్రమాదానికి కారణమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఊయల వేగాన్ని అంచనా వేయలేని వయసులో ఉన్న చిన్నారులు ఆడుకుంటుండగా, దాని కదలికలను పర్యవేక్షించాల్సిన బాధ్యతను సిబ్బంది విస్మరించారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యాజమాన్యంపై తల్లిదండ్రుల ఆగ్రహం

పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే తమ కుమారుడి మృతికి కారణమని అభిరామ్ తండ్రి ఆరోపించారు. పిల్లల భద్రతకు తగిన చర్యలు తీసుకోకుండా పిక్నిక్‌కు ఎలా తీసుకెళ్తారని ప్రశ్నించారు. పాఠశాల యాజమాన్యాన్ని నమ్మి పిల్లలను పంపిస్తే ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందా అంటూ ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు కూడా నిలదీస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పోలీసుల దర్యాప్తు

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం ఎలా జరిగింది? పిక్నిక్ సమయంలో విద్యార్థుల భద్రతకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు? ఉపాధ్యాయులు, సిబ్బంది పర్యవేక్షణ ఉందా? అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.

కవితపై వ్యాఖ్యలు పొరపాటే

ప్రజా వాయిస్, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి సీతక్క విచారం వ్యక్తం చేశారు. తన మాటల్లో పొరపాటు దొర్లిందని అంగీకరిస్తూ వివరణ ఇచ్చారు. అయితే, ఆ వ్యాఖ్యలను పట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కవిత వ్యాఖ్యలను ప్రస్తావించే క్రమంలో..

ములుగులో నిన్న చేయూత పెన్షన్ల పంపిణీ అనంతరం మీడియాతో మాట్లాడిన సమయంలో కవితకు సంబంధించిన అంశాన్ని ప్రస్తావిస్తూ పొరపాటున తప్పు పదం వాడినట్లు సీతక్క తెలిపారు. రాజకీయ కక్షతో బీఆర్ఎస్ తనను క్యాన్సర్ పేషెంట్‌గా చిత్రీకరించిందని కవిత గతంలో ఓ మీడియా ఛానల్‌కు చెప్పిన విషయాన్నే తాను ప్రస్తావించానని వివరించారు. అయితే, ఆ సందర్భంలో 'క్యాన్సర్'కు బదులుగా 'ఎయిడ్స్' అనే పదాన్ని పొరపాటున ఉపయోగించానని స్పష్టం చేశారు. వెంటనే తన వ్యాఖ్యలను సరిదిద్దుకున్నానని తెలిపారు.

బీఆర్ఎస్ ట్రోలింగ్‌పై మండిపాటు

తన వ్యాఖ్యలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తూ వీడియోను వైరల్ చేయడం దుర్మార్గమని సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ పర్యటనలో పెన్షన్ల విషయంలో కేటీఆర్ చేసిన తప్పుడు ప్రచారాన్ని తాను తిప్పికొట్టాననే అక్కసుతోనే బీఆర్ఎస్ శ్రేణులు ఈ విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.

వ్యక్తిగత విమర్శలు తన నైజం కాదు

తాను రాజకీయ ప్రత్యర్థులను సిద్ధాంతపరంగానే ఎదుర్కొంటానని, వ్యక్తిగత విమర్శలు చేయడం తన నైజం కాదని సీతక్క పేర్కొన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు కూడా గమనిస్తున్నారని అన్నారు. తన వ్యాఖ్యల్లో జరిగిన పొరపాటును అంగీకరిస్తూనే, దాన్ని రాజకీయంగా వాడుకుంటూ ట్రోలింగ్ చేయడాన్ని తప్పుబట్టారు. ఈ వివరణతో వివాదానికి ముగింపు పలికేందుకు ఆమె ప్రయత్నించారు.

తెలంగాణలో వలసలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం

- **హరీశ్‌రావు**
- **నీటి విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని ఆరోపణ**
- **కృష్ణా జలాల లెక్కలు అడిగితే సీఎం నైరాశ్యంతో మాట్లాడుతున్నారని విమర్శ**
- **రేవంత్‌రెడ్డి అబద్ధాలను నిజాలుగా చిత్రీకరించలేరని వ్యాఖ్య**
- **చంద్రబాబు ఏజెంట్‌ను సీఎం పక్కన పెట్టుకున్నారంటూ ఘాటు విమర్శ**



ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణలో వలసలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రానికి నీటి విషయంలో అన్యాయం జరుగుతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు. తెలంగాణకు కృష్ణా నది నీళ్లను ఎత్తిపోయాలని కోరితే సీఎం దుమ్మెత్తిపోస్తున్నారని మండిపడ్డారు.సీఎం హోదాలో ఉండి అబద్ధాలు చెబితే అవి నిజాలైపోవని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. నీటి కేటాయింపులు, వినియోగంపై తాము లెక్కలు అడుగుతుంటే ముఖ్యమంత్రి నైరాశ్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.చంద్రబాబు ఏజెంట్‌ను రేవంత్‌రెడ్డి తన పక్కన పెట్టుకున్నారని హరీశ్‌రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, నీటి హక్కుల విషయంలో తెలంగాణకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌కు సింగూరు నీటి సరఫరాకు బ్రేక్?

ప్రజా వాయిస్, హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావం, ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రాష్ట్రంలోని జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. ఈ ప్రభావం హైదరాబాద్ నగర తాగునీటి సరఫరాపైనా పడే పరిస్థితి కనిపిస్తోంది. నగరానికి ప్రధాన నీటి వనరుల్లో ఒకటైన సింగూరు జలాశయంలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రస్తుతం సుమారు 1.95 నుంచి 1.99 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ నీటిని పొదుపుగా వినియోగించినా డిసెంబర్ 20 వరకు మాత్రమే సరఫరా చేయగలమని అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డి జిల్లాలోని పరిశ్రమలకు సింగూరు జలాల సరఫరా నిలిచిపోయే అవకాశం ఉంది.



జలాశయం	పూర్తి స్థాయి (అడుగుల్లో)	నిల్వ సామర్థ్యం (టీఎంసీలు)	ప్రస్తుత నిల్వ (టీఎంసీలు)
ఉస్మాన్‌సాగర్	1790	3.518	1.92
హిమాయత్‌సాగర్	1763.5	2.521	2.01
సింగూరు	1717.932	29.917	1.952
నాగార్జునసాగర్	590	312.045	177.06
శ్రీపాద ఎల్లంపల్లి	485.56	20.175	17.119

40 ఎంజీడీల గోదావరి నీటికి ఏర్పాట్లు

సింగూరు, మంజీరా జలాలపై ఆధారపడే ప్రాంతాల్లో నీటి కొరతను అధిగమించేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. గోదావరి నుంచి అదనంగా 40 మిలియన్ గ్యాలన్ల నీటిని (ఎంజీడీ) గ్రేటర్ హైదరాబాద్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లో సింగూరు, మంజీరా నీటిపై ఆధారపడే ప్రాంతాలకు ఈ నీటిని అందించాలని భావిస్తోంది.పశ్చిమ హైదరాబాద్‌లో మూడు లక్షలకు పైగా నీటి కనెక్షన్లు ఉండగా.. అదనంగా వచ్చే గోదావరి జలాలతో సుమారు 50 శాతం నీటి కొరతను భర్తీ చేయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మిగిలిన అవసరాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని భావిస్తున్నారు.

పరిశ్రమలకు నీటి కష్టాలు తప్పవా?

సింగూరు నీటి సరఫరా నిలిచిపోతే సంగారెడ్డి జిల్లాలోని కీలక సంస్థలు, పరిశ్రమలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ఐఐటీ హైదరాబాద్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) వంటి సంస్థలు ప్రత్యేక పైప్‌లైన్ల ద్వారా నీటిని పొందుతున్నాయి. వీటితో పాటు పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతం, కాలుష్య ప్రభావిత గ్రామాల నీటి అవసరాలపైనా అధికారులు దృష్టి సారించారు.మొదట పటాన్‌చెరుకు 20 ఎంజీడీల గోదావరి నీటిని కేటాయించేందుకు ప్రభుత్వం అనుమతించిందని, అవసరాన్ని బట్టి ఆ పరిమాణాన్ని 40 ఎంజీడీలకు పెంచేందుకు అంగీకరించిందని మంజీరా రిజర్వాయర్ సంగారెడ్డి డివిజన్ జనరల్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు. ఇతర ప్రాంతాల్లో నీటి అవసరాల కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సి రావచ్చని పేర్కొన్నారు.

మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్‌కు పైప్‌లైన్

హైదరాబాద్‌కు అదనపు గోదావరి జలాలను అందించేందుకు మిషన్ భగీరథ, జలమండలి అధికారులు పనులను వేగవంతం చేశారు. మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఎంబీఆర్)కు నీటిని తరలించే 1,600 మిల్లీమీటర్ల పైప్‌లైన్ అనుసంధాన పనులు పూర్తయ్యాయి. అయితే మిషన్ భగీరథ పరిధిలో కొన్ని పైప్‌లైన్ పనులు, జంక్షన్లు, తుది కనెక్షన్లు ఇంకా పూర్తి కావాల్సి ఉంది.ఘన్‌పూర్ ఎంబీఆర్ వద్ద జలమండలి చేపట్టాల్సిన జంక్షన్ పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను రెండు రోజుల్లో పూర్తి చేసి ఈ వారంలోనే ట్రయల్ రన్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. జలమండలి ఎండీ కె. అశోక్‌రెడ్డి, మిషన్ భగీరథ ఇంజినీర్-ఇన్-చీఫ్ కృపాకర్‌రెడ్డి ఇటీవల పనులను పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

150 మీటర్ల రాతి నిర్మాణాలతో ఆలస్యం

వాస్తవానికి ఈ ప్రాజెక్టు పనులను ఈ నెల 15వ తేదీ నాటికే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే అటవీ ప్రాంతంలో సుమారు 150 మీటర్ల మేర పైప్‌లైన్ మార్గంలో భారీ రాతి నిర్మాణాలు ఎదురుకావడంతో పనులు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం వాటిని అధిగమించి తుది పనులు పూర్తి చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ట్రయల్ రన్ విజయవంతమైతే అదనపు గోదావరి జలాలు హైదరాబాద్‌కు అందుబాటులోకి రానున్నాయి.

2019లోనూ ఇదే పరిస్థితి

గతంలో 2019లోనూ సింగూరు ప్రాజెక్టు దాదాపు అడుగంటడంతో ఇలాంటి నీటి సంక్షోభం ఏర్పడింది. అప్పట్లో యెల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చిన గోదావరి నీటిని ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా పటాన్‌చెరుకు మళ్లించారు. ప్రస్తుత నీటి కొరతకు మంజీరా పరీవాహక ప్రాంతంలో ఆశించిన స్థాయిలో ఇన్‌ఫ్లోలు లేకపోవడమే ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు. కర్ణాటక ఎగువ ప్రాంతాల నుంచి కూడా తగినంత నీరు రాలేదని పేర్కొంటున్నారు.2025లో వరదల కారణంగా సుమారు 300 టీఎంసీల నీరు సింగూరుకు చేరినప్పటికీ.. ప్రాజెక్టు భద్రతా చర్యల్లో భాగంగా పెద్ద మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేశారు. అనంతరం పనుల కోసం మరో 8 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి వచ్చింది. వర్షాలతో అదనంగా నీరు చేరుతుందని, వేసవి అవసరాలు తీరుతాయని అధికారులు అంచనా వేసినా.. ఆశించిన స్థాయిలో నిల్వలు పెరగలేదు.

గోదావరి జలాల మళ్లింపే తక్షణ పరిష్కారం

సింగూరు–మంజీరా నీటిపై ఆధారపడే హైదరాబాద్ పశ్చిమ ప్రాంతాలు, సంగారెడ్డి పారిశ్రామిక ప్రాంతాలకు రానున్న రోజుల్లో నీటి ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్‌కు గోదావరి జలాల తరలింపు పనులు సకాలంలో పూర్తయితే కొంతవరకు ఉపశమనం లభించనుంది. ట్రయల్ రన్, తదుపరి నీటి సరఫరా ప్రారంభంపై అధికారుల చర్యలే కీలకం కానున్నాయి.





అటెండర్ మణికుమార్ మృతిపై కేసీఆర్ దిగ్భ్రాంతి

- **కుటుంబానికి అండగా ఉంటామని హామీ**
- **రోడ్డు ప్రమాదంలో మణికుమార్ దుర్మరణం**
- **ముస్తాబాద్ మండలం బంధనకల్ వద్ద ఘటన**
- **మణి తమ కుటుంబంలో ఒకడిగా కలిసిపోయాడన్న కేసీఆర్**
- **మణికుమార్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా**
- **అంత్యక్రియలు దగ్గరుండి నిర్వహించాలని పార్టీ నేతలకు సూచన**

ప్రజా వాయిస్, రాజన్న సిరిసిల్ల: రోడ్డు ప్రమాదంలో తన నివాసంలో అటెండర్‌గా పనిచేస్తున్న మణికుమార్ మృతి చెందడంపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అతడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం బంధనకల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మణికుమార్ ప్రాణాలు కోల్పోయారు.

కుటుంబంలో ఒకడిగా కలిసిపోయాడు

మణికుమార్ మరణవార్త తెలిసిన వెంటనే కేసీఆర్ దంపతులతో పాటు మాజీ మంత్రి కేటీఆర్, ఆయన సతీమణి శైలిమ, కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మణికుమార్ తమ కుటుంబంలో ఒకడిగా కలిసిపోయాడని కేసీఆర్ ఆవేదన చెందారు. రోడ్డు ప్రమాదంలో అతడు మృతిచెందడం తమను ఎంతగానో కలిచివేసిందని పేర్కొన్నారు. మణికుమార్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అంత్యక్రియలు దగ్గరుండి నిర్వహించాలని సూచన

మణికుమార్ అంత్యక్రియలను దగ్గరుండి నిర్వహించాలని మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్, ముస్తాబాద్ మాజీ జడ్పీటీసీ శరత్‌రావుకు కేసీఆర్ సూచించారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు

చేతబడి, పూజల పేరుతో డబ్బు రెట్టింపు మోసం

మొదటి పేజీ తరువాయి

రూ.8 లక్షలు మోసపోయిన రాములు ఈ నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఉట్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అసలు నోట్ల మధ్య నకిలీ కట్టలు

దర్యాప్తులో ముఠా మోసాల పద్ధతిని పోలీసులు గుర్తించారు. నకిలీ నోట్ల కట్టలు అసలైనవిగా కనిపించేలా వాటి పైన, కింద కొన్ని నిజమైన కరెన్సీ నోట్లను ఉంచి, మధ్యలో నకిలీ నోట్లను పెట్టేవారని తెలిపారు. దీంతో బాధితులు కట్ట మొత్తం అసలు నోట్లతోనే ఉందని నమ్మి మోసపోయేవారని వివరించారు. ప్రధాన నిందితులకు నకిలీ నోట్ల కట్టలను సరఫరా చేయడంలో మరో నలుగురు సహకరిస్తున్నట్లు గుర్తించారు.

నలుగురి అరెస్ట్..
మరో ఇద్దరు ఇప్పటికే అదుపులో

ఈ కేసులో అరెస్టయిన వారిని ఎంబండి మల్లేష్ (36), చీటి తరుణ్ (24), జమాల్‌పూర్ సాయికృష్ణ అలియాస్ సాయి (25), పెంద్రం సురేష్ (39)గా గుర్తించారు. వీరు నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు చెందినవారని పోలీసులు తెలిపారు. నిందితులపై ఆదిలాబాద్, హైదరాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో కేసులు నమోదైనట్లు వెల్లడించారు. ఒక్కొక్కరిపై సుమారు మూడు కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.ముఠాలోని ప్రధాన నిందితులు అత్తం పరశురాం (40), మందలి బక్కన్న (47)లను సోమవారం ఇచ్చోడ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన మరో కేసులో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాధితులు ముందుకు రావాలి

ఈ ముఠా చేతిలో సుమారు 40 మంది వరకు మోసపోయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. బాధితులు ఎవరైనా ఉంటే భయపడకుండా పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. చేతబడి, ప్రత్యేక పూజలు లేదా ఇతర పద్ధతుల ద్వారా డబ్బును రెట్టింపు చేస్తామంటూ ఎవరైనా ఆశ చూపితే నమ్మవద్దని ప్రజలను హెచ్చరించారు.

గ్రీన్ ట్యాంకర్లలో నాలా మురుగు నీరా?

మొదటి పేజీ తరువాయి

తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాల్సిన ట్యాంకర్లలోకి నాలా నీరు ఎలా చేరుతోందని ప్రశ్నిస్తున్నారు. నీటిని ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు? ఎస్టీపీల నుంచి అధికారికంగా తీసుకుంటున్నారా? లేక నాలాల నుంచి నేరుగా నింపుతున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నాణ్యత పరీక్షలు చేస్తున్నారా?

ట్యాంకర్లలో నీటిని నింపే కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ ఉందా? సరఫరాకు ముందు నీటి నాణ్యతను పరీక్షిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. శుద్ధి చేయని మురుగు నీటిని గార్డెనింగ్, నిర్మాణ అవసరాలకు వినియోగిస్తే ప్రజారోగ్యం, పర్యావరణంపై ప్రతికూల ప్రభావాలు పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల విచారణతో వెలుగులోకి రానున్న వాస్తవాలు

ఈ ఆరోపణల నేపథ్యంలో జలమండలి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు విచారణ చేపట్టారు. నీటిని ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు? శుద్ధి ప్రక్రియ జరుగుతోందా? నాణ్యత పరీక్షలు, పర్యవేక్షణ ఎలా నిర్వహిస్తున్నారు? అనే అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. గ్రీన్ ట్యాంకర్ల సరఫరా కేంద్రాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల విచారణలోనే ఈ వ్యవహారంపై పూర్తి స్పష్టత రానుంది.



దీపం వెలిగిస్తుండగా చీరకు మంటలు

- **వృద్ధురాలు మృతి**
- **ఎస్ఆర్ నగర్‌లో విషాద ఘటన**
- **ప్రమాదవశాత్తూ చీరకు అంటుకున్న మంటలు**
- **ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి**
- **ఇంట్లో సోఫా, ఏసీ పూర్తిగా దగ్ధం**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

ప్రజా వాయిస్, హైదరాబాద్:నగరంలోని ఎస్ఆర్ నగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో దీపాలు వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తూ చీరకు మంటలు అంటుకోవడంతో ఓ వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ఎస్ఆర్ నగర్‌లోని జగన్నాథ్ రెసిడెన్సీలో ఫ్లాట్ నంబర్ 403లో చాపర్ల భానుమతి (62) దీపాలు వెలిగిస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ ఆమె చీరకు మంటలు అంటుకున్నాయి. దీంతో తీవ్రంగా గాయపడిన భానుమతిని కుటుంబ సభ్యులు తొలుత ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రికి, అనంతరం బంజారాహిల్స్‌లోని విరించి ఆస్పత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 9:54 గంటలకు ఆమె మృతిచెందారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని సోఫా, ఏసీ పూర్తిగా కాలిపోయాయి. మృతురాలి కుమార్తె బండ్ల కిన్నెర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భానుమతి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



టీపీపీలో దసరా పార్టీ వివాదం.. ఉద్యోగిపై కులం పేరుతో దూషణలు?

- పార్టీ ఖర్చుల లెక్కలు అడిగినందుకే గొడవ
- దాడికి యత్నించారంటూ బాధితుడి ఆరోపణలు
- విధుల్లో ఉండగానే అసభ్య పదజాలంతో దూషించారని ఫిర్యాదు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదంటూ ఆవేదన

ప్రజా వాయిస్ భూపాలపల్లి భూపాలపల్లి జిల్లా చెల్పూర్‌లోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ)లో దసరా సందర్భంగా నిర్వహించిన ఉద్యోగుల పార్టీ వివాదానికి దారితీసింది. ఉద్యోగులందరూ కలిసి డబ్బులు సేకరించి పార్టీ నిర్వహించుకోగా, ఆ పార్టీకి సంబంధించిన ఖర్చుల లెక్కలు అడగడమే వివాదానికి కారణమైనట్లు సమాచారం. ఈ క్రమంలో ఓ ఉద్యోగిని కులం పేరుతో దూషించడమే కాకుండా దాడికి ప్రయత్నించారని బాధితుడు ఆరోపిస్తున్నారు. కానిస్టేబుల్ కేటగిరీకి చెందిన ఉద్యోగులు దసరా సందర్భంగా పరస్పరం డబ్బులు సేకరించి పార్టీ నిర్వహించుకున్నట్లు తెలుస్తోంది. అయితే పార్టీ నిర్వహణకు సంబంధించిన ఖర్చుల వివరాలు, సేకరించిన డబ్బుల లెక్కలు అడగడంతో కొందరి మధ్య వివాదం మొదలైనట్లు బాధితుడు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో విధుల్లో ఉన్న సమయంలోనే ఓ ఉద్యోగి తనను కులం పేరుతో అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా, దాడికి ప్రయత్నించాడని బాధితుడు ఆరోపించారు. ఉద్యోగుల మధ్య తలెత్తిన ఆర్థిక లావాదేవీల వివాదం కుల పరమైన దూషణల వరకు వెళ్లడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు వాపోయారు. నిందితుడికి అధికారులు అండగా నిలుస్తున్నారనే అనుమానాన్ని కూడా వ్యక్తం చేశారు. అయితే ఈ ఆరోపణలపై అధికారుల స్పందన తెలియాల్సి ఉంది. విధుల్లో ఉన్న ఉద్యోగిపై కులం పేరుతో దూషణలకు పాల్పడటం, దాడికి ప్రయత్నించడం వంటి ఆరోపణలను అధికారులు తీవ్రంగా పరిగణించాలని బాధితుడు కోరుతున్నారు. ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కేటీపీపీ ఉన్నతాధికారులు ఈ వివాదంపై స్పందిస్తారా? ఉద్యోగుల మధ్య తలెత్తిన ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడిస్తారా? బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారా? అన్నది వేచి చూడాలి.



ఉపసర్పంచ్‌పై ఎస్‌ఐకి సర్పంచ్ ఫిర్యాదు

- మహిళా సర్పంచ్ పట్ల అసభ్య ప్రవర్తన
- చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజా వాయిస్, కోనరావుపేట/సిరిసిల్ల:రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామ ఉపసర్పంచ్ తిక్కల నవీన్‌పై గ్రామ సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా సోమవారం కోనరావుపేట ఎస్ఐ రామ్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ పాలకవర్గ సమావేశంలో దసరా పండుగ ఖర్చులు, గ్రామంలో మౌలిక వసతుల కల్పన, వాటికి సంబంధించిన ఖర్చుల విషయమై వార్డు సభ్యులతో చర్చిస్తున్న సమయంలో ఉపసర్పంచ్ నవీన్ తన సెల్‌ఫోన్‌లో వీడియోలు తీస్తూ తనను దూషించారని సర్పంచ్ ఆరోపించారు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన తన భర్త ఉపసర్పంచ్ తీరును ప్రశ్నించగా, ఆయనను సైతం అసభ్య పదజాలంతో దూషిస్తూ దురుసుగా ప్రవర్తించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళా సర్పంచ్‌గా తన పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపసర్పంచ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని మహిళలకు న్యాయం చేయాలని ఆమె పోలీసులను కోరారు. ఈ సందర్భంగా మండల మహిళా సర్పంచులు ఆమని, లక్ష్మి , స్వప్న, గౌతమి, చైతన్యతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మానుక సత్తయ్య, కోనరావుపేట పీఏసీఎస్ చైర్మన్ గంగాధర్ తదితరులు సర్పంచ్‌కు మద్దతుగా ఎస్ఐకు ఫిర్యాదు అందజేశారు.

అక్షరాల ఆలయంలో ఆరని చితులు

- వ్యవస్థల వైఫల్యమా? పాలకుల ఉదాసీనతా?
- మారిన ప్రభుత్వాలు.. మారని విద్యార్థుల తలరాతలు
- బాసర ట్రిపుల్ ఐటీలో ఆగని ఆత్మహత్యల పరంపర!
- విద్యాశాఖ ముఖ్యమంత్రి గారూ.. బాసర ట్రిపుల్ ఐటీ మరణమృదంగానికి ముగింపు ఎప్పుడు?



నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి దక్షిణ భారతదేశంలోనే ఏకైక అక్షర క్షేత్రం,చదువుల తల్లి కొలువైన బాసర పుణ్యక్షేత్రం సాక్షిగా ఉన్నత విద్యా కుసుమాలు రాలిపోతున్నాయి. ఎన్నో ఆశలతో,బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని బాసర ట్రిపుల్ ఐటీ (RGUKT) గడప తొక్కిన విద్యార్థులు, విగతజీవులుగా మారి తల్లిదండ్రులకు తీరని కడుపుకోతను మిగుల్చుతున్నారు.తాజాగా సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందిన ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సర విద్యార్థి చల్లా సంపత్ (19) బలవన్మరణానికి పాల్పడటం మరోసారి క్యాంపస్‌లోని పరిస్థితులపై తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తోంది.

విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రి కే నేరుగా ప్రశ్న

రాష్ట్రంలో విద్యాశాఖ బాధ్యతలను స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే నిర్వహిస్తున్నారు.గత ప్రభుత్వాల హయాంలో బాసర ట్రిపుల్ ఐటీ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని,విద్యార్థుల సమస్యలను పట్టించుకునే నాథుడే లేరని పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి.నేడు ప్రభుత్వం మారినా,బాసర ట్రిపుల్ ఐటీలో మాత్రం విద్యార్థుల మరణాల పరంపర కొనసాగుతుండటం అత్యంత బాధాకరం.సాక్షాత్తూ ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్న విద్యాశాఖ పరిధిలోని ప్రతిష్టాత్మక సంస్థలో ఇలాంటి ఘోరాలు జరుగుతుంటే, అధికారులు ఇంత నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరిస్తున్నారనే ప్రశ్న సర్వత్రా ఉత్పన్నమవుతోంది. కారణం ఏదైనా.. బాధ్యత ఎవరిది?క్యాంపస్‌లో ఏ విద్యార్థి ఏ కారణంతో ప్రాణాలు తీసుకున్నప్పటికీ, ఆ పరిస్థితులు ఎందుకు తలెత్తుతున్నాయనే దానిపై లోతైన విశ్లేషణ జరగడం లేదు.విద్యార్థులపై విపరీతమైన మానసిక ఒత్తిడి ఉంటుందా క్యాంపస్‌లో కనీస కౌన్సెలింగ్ వ్యవస్థ,వసతులు కొరవడ్డాయా? విద్యార్థుల ఆవేదనను వినేందుకు,వారికి భరోసా కల్పించేందుకు యంత్రాంగం విఫలమవుతోందా?గతంలో ఎన్ని ఘటనలు జరిగినా,కేవలం విచారణల పేరుతో కాలయాపన చేయడం తప్ప, వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. అధికారులు మారాలి,వారి పనితీరు మారాలి అని ఎన్నిసార్లు గొంతు చించుకున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది.

ఇప్పటికైనా కళ్లు తెరుస్తారా?

సరస్వతీ మాత కొలువైన ఈ పవిత్ర భూమిలో,విద్యార్థుల ఆక్రందనలు వినిపించడం ప్రభుత్వానికి, అధికారులకు ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ఉన్నత చదువుల కోసం వచ్చిన బిడ్డలను క్షేమంగా ఇంటికి పంపాల్సిన బాధ్యత విద్యాసంస్థలది, ప్రభుత్వానిది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే బాసర ట్రిపుల్ ఐటీపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.విద్యార్థులకు మానసిక భరోసా కల్పించేలా క్యాంపస్‌లో పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసి,ఇకపై మరో తల్లి కడుపు కోతకు గురికాకుండా చూడాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, మేధావులు డిమాండ్ చేస్తున్నారు

బీఆర్ఎస్ కంచు కోట " సిద్దిపేట " గడ్డపై ప్రధాన పార్టీల ఫోకస్.!

- పోటా పోటీగా ఇతర పార్టీల భహిరంగ సభలు, సమావేశాలు
- అసెంబ్లీ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా వ్యూహాలు
- నారాజ్ లీడర్లకు గాలం
- జోరుగా సభలు.. సమావేశాలు
- సిద్దిపేట మున్సిపల్ ఎన్నికలపై కీలక దృష్టి



ప్రజా వాయిస్/దుబ్బాక:భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కంచుకోట. రెండు దశాబ్దాలుగా అన్ని అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీనే విజయం సాధిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం సిద్దిపేట మున్సిపాలిటీ, నియోజకవర్గ పరిధిలోని ఎంపీపీ, జడ్పీటీసీలు, సర్పంచ్ ఎన్నికల్లో సైతం గులాబీ పార్టీ సత్తా చాటి జెండా ఎగురవేస్తోంది. తద్వారా నియోజకవర్గంపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి తనకు తిరుగు లేదని, ఏ పార్టీ పోటీ కాదని నిరూపిస్తోంది. దీంతో ఇప్పుడు ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ తోపాటు, కొత్తగా ఆవిర్భవించిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలు సిద్దిపేటపై ప్రత్యేక దృష్టి సారించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

జోరుగా సభలు.. సమావేశాలు..

అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేండ్ల సమయం ఉండగా బీఆర్ఎస్ పార్టీ ఆధిపత్యానికి చెక్ పెట్టాలన్న లక్ష్యంతో ఆయా పార్టీలు ఇప్పటి నుంచే వ్యూహరచన మొదలు పెట్టాయి. ఈ మేరకు నియోజకవర్గంలో పార్టీల బలం పెంచుకునేందుకు, వివిధ వర్గాల ప్రజల మద్దతు కూడగట్టుకునేందుకు పోటా పోటీగా సభలు, సమావేశాలు, పాదయాత్రలు నిర్వహిస్తున్నాయి. సిద్దిపేట జిల్లా ఏర్పడి పదేండ్లు పూర్తయిన సందర్భంగా అక్టోబర్ లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పదేండ్ల జిల్లా పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆధ్వర్యంలో సిద్దిపేట కేంద్రంగా ప్రత్యేక జిల్లా సాధించుకోవడంతోపాటు, జిల్లాలో ప్రత్యేకించి సిద్దిపేటలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి విస్తృత ప్రచారం నిర్వహించారు. కొత్తగా ఆవిర్భవించిన తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కవిత సైతం సిద్దిపేట పై స్పెషల్ ఫోకస్ పెట్టారు. నియోజకవర్గంపై పట్టు సాధించే దిశగా కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో సిద్దిపేట జిల్లా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్ట్ లోక రవిచంద్రను నియమించడంతో పాటు, పట్టణంలో పార్టీ జిల్లా ఆఫీస్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కవిత బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని తీవ్రమైన ఆరోపణలు చేయడంతో పాటు, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి సిద్దిపేటలో టీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు. హరీష్ రావుకు, బీఆర్ఎస్ పార్టీకి గట్టిపట్టున్న సిద్దిపేటనియోజకవర్గంపై అధికార కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఈ నియోజకవర్గంలో బలం పెంచుకోవడంలో భాగంగా గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తరచూ సిద్దిపేటలో పర్యటిస్తు పార్టీ క్యాడర్ లో ఉత్సాహం నింపేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సైతం సిద్దిపేట నియోజకవర్గంలో తరచూ పర్యటిస్తున్నారు. ప్రభుత్వ పరంగా మంజూరైన కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు, చేయూత పెన్షన్ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీకి మద్దతు కూడగట్టాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. నియోజకవర్గంలో బలం పెంచుకునే క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఈ నెల 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి బహిరంగ సభ కూడా నిర్వహించింది. ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ సభకు భారీగా జనసమీకరణ చేయడం ద్వారా ప్రజలు మార్పు కోరుకుంటున్నారనే సంకేతం ఇచ్చే ప్రయత్నం చేసింది. సీఎం చేతుల మీదుగా రూ. 544 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ముఖ్యంగా ప్రభుత్వం సిద్దిపేటకు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తోపాటు, నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసింది. సిద్దిపేట గవర్నమెంట్ మెడికల్ కాలేజీకి మాజీ మంత్రి అనంతుల మదన్ మోహన్ పేరు పెట్టాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కోరడం, సీఎం హామీ ఇవ్వడం, ఆవెంటే జీఓ జారీ కావడం చకచకా జరిగిపోయాయి. బీజేపీ సైతం సిద్దిపేట నియోజకవర్గంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ఈనెల 25న సిద్దిపేటలో మహా పాదయాత్ర నిర్వహించ తల పెట్టింది. మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆధ్వర్యంలో జరుగనుంది.

నారాజ్ లీడర్లకు గాలం...


సిద్దిపేట నియోజకవర్గంపై పట్టు సాధించాలని చూస్తున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలోని అసంతృప్త నేతలను తమ పార్టీలోకి తీసుకోపడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు నామినేటెడ్ పదవులు లభించక, నియోజకవర్గ పరిధి మండలాల్లో గడచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కక నారాజ్ అయిన నాయకుల గురించి ఆరా తీస్తూ వారిని తమ పార్టీలో చేర్చుకునేందుకు చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది.

త్వరలో సిద్దిపేట మున్సిపాలిటీ ఎన్నికలు..!

సిద్దిపేట మున్సిపాలిటీకి త్వరలో ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సిద్దిపేట పట్టణంలో పట్టు పెంచుకోవడంపై స్పెషల్ ఫోకస్ పెడుతున్నాయి. మెజారిటీ కౌన్సిలర్ స్థానాల్లో గెలుపొంది మున్సిపాలిటీపై జెండా ఎగరవేయడం లక్ష్యంగా ఆయా పార్టీ నాయకులు పావులు కదుపుతున్నారు. వార్డుల వారీగా ప్రజాబలం ఉన్న నాయకులు ఎవరనేదానిపై కసరత్తు చేస్తున్నాయి.

పేలుళ్ల మోత....కంపిస్తున్న భూమి

- భయం గుప్పిట్లో అల్కాపురి వణికిపోతున్న భవనాలు
- ఇళ్లలో ఉండాలంటేనే జంకుతున్న జనాలు
- ఈఏపిఎల్,లాన్సమ్ బిల్డర్ల ఇష్టారాజ్యం
- క్షేత్రస్థాయి పరిశీలన జరిపి బిల్డర్లను నిలదీసిన బీఆర్ఎస్ నేతలు
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- కలెక్టర్, మైనింగ్ శాఖ తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్



ప్రజా వాయిస్||రాజేంద్రనగర్: బిల్డర్ల ఇష్టానుసారం ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. సమయపాలన లేకుండా బ్లాస్టింగ్లు చేపట్టడంతో భూమి కంపిస్తూ చుట్టుపక్కల భవనాలకు బీటలు వారి ఎప్పుడూ ఎలాంటి ప్రమాదం వస్తుందోనని స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారూ. వివరాల్లోకి వెళితే. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నార్సింగి సర్కిల్, నెక్నంపూర్ డివిజన్ అల్కాపురి రోడ్డు నంబర్ 13లో బిల్డర్ల ఇష్టారాజ్యం స్థానికులకు నరక యాతనగా మారింది. ఈఏపిఎల్,లాన్సమ్ బిల్డర్స్ చేపట్టిన నూతన భవన నిర్మాణ పనుల్లో భాగంగా జరుపుతున్న భారీ పేలుళ్ల మోతతో అల్కాపురి ప్రాంతం దద్దరిల్లుతోంది. పేలుళ్ల ధాటికి భూమి కంపిస్తుండటం, చుట్టుపక్కల భవనాలు ఒక్కసారిగా వణికిపోతుండటంతో సొంత ఇళ్లలో ఉండాలంటేనే జనాలు జంకుతూ తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు.ఈ మేరకు బీఆర్ఎస్,నాయకులు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి,అందే లక్ష్మణ్ రావు,గోరుకంటి విఠల్,షేక్ ఆరిఫ్,మాల్యాది నాయుడు,విజయలక్ష్మి , రాజేంద్రప్రసాద్,దేవి ప్రియ, యాలాల కిరణ్, బాబురావు తదితరులు అల్కాపురిలోని నిర్మాణ స్థలం వద్ద క్షేత్రస్థాయి పరిశీలన జరిపి బిల్డర్లను నిలదీశారు.ఈ సందర్భంగా బ్లాస్టింగ్ కార్యాచరణ చేపట్టే ముందు నివాసితులకు తప్పనిసరిగా ముందస్తు సమాచారం అందించాలని, చుట్టుపక్కల భవనాలు మరియు మౌలిక సదుపాయాలను రక్షించడానికి అవసరమైన భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని,ప్రకంపనలు మరియు సమీప ఆస్తులకు జరిగే నష్టాన్ని తగ్గించేలా బహిరంగ పేలుళ్లు ఆపి నియంత్రిత బ్లాస్టింగ్ పద్ధతులను మాత్రమే అవలంబించాలని,అలాగే పేలుళ్ల కారణంగా భవనాలకు నష్టం వాటిల్లినట్లు నిర్ధారణ అయిన చోట ఆ నష్టాన్ని తక్షణమే అంచనా వేసి బిల్డర్లే స్వయంగా మరమ్మతులు చేపట్టాలని ఘాటుగా హెచ్చరించారు. సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణ లోపం,వైఫల్యం కారణంగానే బిల్డర్లు నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నేతలు, తెలంగాణ రాష్ట్ర గనులు, భూగర్భశాస్త్ర విభాగం అధికారులు,జిల్లా కలెక్టర్ తక్షణమే నిర్మాణ స్థలాలను తనిఖీ చేసి బిల్డర్లు పాటిస్తున్న భద్రతా ప్రమాణాలను ధృవీకరించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నివాసితుల భద్రతను,వారి ఆస్తుల రక్షణను నిర్ధారించే విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని,ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు సంబంధిత అధికారులతో టచ్ లో ఉంటూ స్థానికులకు అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు.



ఉద్యోగాల హామీ ఏమైంది.. నిరుద్యోగుల బతుకులేమయ్యాయి

- యువతను నట్టేట ముంచిన కాంగ్రెస్ సర్కార్
- ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగులు
- పట్టభద్రుల పక్షాన మండలిలో పోరాడే గొంతుక రాకేష్ రెడ్డి
- కోదాడలో నిరుద్యోగులు, పెన్షనర్లతో ముఖాముఖి
- ఎమ్మెల్సీగా గెలిపిస్తే సమస్యలపై నిరంతర పోరాటం
- మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని బొల్లం విజ్ఞప్తి

ప్రజా వాయిస్ ,కోదాడ:రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు న్యాయం జరగడం లేదని విమర్శించారు. వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డితో కలిసి కోదాడలో విస్తృతంగా పర్యటించారు. మార్నింగ్ వాక్‌లో పట్టభద్రులను కలుసుకుని సమస్యలు తెలుసుకున్నారు. గ్రంథాలయం, స్టడీ సెంటర్లలో నిరుద్యోగులతో మాట్లాడి స్టడీ మెటీరియల్ అందజేశారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులతో సమావేశమై పీఆర్సీ, డీఏ బకాయిలు, పెన్షన్ సమస్యలపై చర్చించారు. నిరుద్యోగులు, పట్టభద్రులు, పెన్షనర్ల సమస్యలపై శాసనమండలిలో గళమెత్తే నాయకుడు రాకేష్‌రెడ్డి అని పేర్కొంటూ ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బొల్లం మల్లయ్య యాదవ్ కోరారు.



ఫ్యూయల్ కంటే అనుమతుల వ్యవహారంపైనే చర్చ

- చెంజర్ల లో పెట్రోల్ బంకుపై గ్రామంలో రకరకాల వాదనలు
- అధికారుల పర్యవేక్షణపై వినిపిస్తున్న ప్రశ్నలు
- అసలు తెర వెనుక ఏం జరుగుతోంది?
- ఆధారాలతో త్వరలో ప్రజల ముందుకు రానున్న ప్రజా వాయిస్

ప్రజా వాయిస్, కరీంనగర్ ప్రతినిధి.(నవంబర్ 24): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామంలోని పెట్రోల్ బంకు వ్యవహారం ప్రస్తుతం గ్రామంలో చర్చనీయాంశంగా మారుతోంది. సాధారణంగా పెట్రోల్ బంకు అంటే ఇంధన ధరలు, నాణ్యత, కొలతలు, మూత్రశాలలు వంటి అంశాలపై చర్చ జరుగుతుంది. కానీ ఇక్కడ మాత్రం ఫ్యూయల్ విక్రయాల కంటే బంకుకు సంబంధించిన అనుమతులు, నిర్వహణ వ్యవహారాలపైనే రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. అసలు ఈ చర్చలకు కారణమేంటి? బంకు నిర్వహణలో నిబంధనలు సక్రమంగా పాటిస్తున్నారా? సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఉన్నాయా? ఉంటే వాటి వివరాలేమిటి? అధికారుల పర్యవేక్షణ ఎలా సాగుతోంది? అనే ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై గ్రామంలో వినిపిస్తున్న మాటలు, గుసగుసలు కేవలం ఊహాగానాలుగానే మిగిలిపోతాయా? లేక వాటి వెనుక వాస్తవాలు ఉన్నాయా? అన్నది తేలాల్సి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.


ప్రజా వాయిస్ ప్రత్యేక పరిశీలన

ఈ అంశాన్ని ప్రజా వాయిస్ అంత తేలిగ్గా వదిలేయడం లేదు. బంకుకు సంబంధించిన అనుమతులు, నిర్వహణ నిబంధనలు, సంబంధిత అధికారుల బాధ్యతలు తదితర అంశాలపై అందుబాటులో ఉన్న రికార్డులు, ఆధారాలను పరిశీలించి మరికొద్ది రోజుల్లో పూర్తి వివరాలతో ప్రజల ముందుకు రానుంది.అప్పటివరకు చెంజర్లలో వినిపిస్తున్న ఈ అంతులేని ముచ్చట్లకు సమాధానం దొరుకుతుందా? అసలు వాస్తవాలు ఏమిటి? అన్నది వేచి చూడాల్సిందే!

రఘునాథపాలెం పంచాయతీలో రూ.35 లక్షల నిధుల గోల్‌మాల్!

- అభివృద్ధి నిధులు వ్యక్తిగత ఖాతాలకు మళ్లించారంటూ ఆరోపణలు
- సర్పంచ్ భర్త, కార్యదర్శి తీరుపై గ్రామస్థుల ఆగ్రహం
- రూ.14 లక్షలతో నిర్మించిన బాత్ రూమ్ ల ఖర్చుపైనా అనుమానాలు
- విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు ఫిర్యాదు





ప్రజా వాయిస్ | మఠంపల్లి | నవంబర్ 24

గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై పర్యవేక్షణ లోపిస్తోందా? అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సిన నిధులు వ్యక్తిగత ఖాతాలకు మళ్లుతున్నాయా? అంటే రఘునాథపాలెం గ్రామపంచాయతీలో వెలుగుచూస్తున్న ఆరోపణలు ఈ ప్రశ్నలకు తావిస్తున్నాయి. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెం గ్రామపంచాయతీలో 15వ ఆర్థిక సంఘానికి సంబంధించిన సుమారు రూ.35 లక్షల నిధుల దుర్వినియోగం జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సర్పంచ్ కమని కుమారి భర్త నర్సింహారావు, గ్రామపంచాయతీ కార్యదర్శి ధరావత్ లక్ష్మణ్ నాయక్ కుమ్మక్కై గ్రామ అభివృద్ధి నిధులను వ్యక్తిగత అవసరాలకు మళ్లించుకున్నారనీ ఫిర్యాదు చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.గ్రామస్థులు అందించిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. గ్రామపంచాయతీ ఖాతా నుంచి సర్పంచ్ భర్త నర్సింహారావు వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు పలు విడతలుగా నగదు బదిలీ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2026 మార్చి 13న రూ.1,87,333, రూ.1,64,670, రూ.1,37,800 మొత్తం రూ. 4,90,003 అలాగే మార్చి 20న రూ.1,91,212, మార్చి 25న రూ.5,53,000తో పాటు మరో రూ.లక్ష, మార్చి 31న మరో రూ.లక్ష చొప్పున నగదు బదిలీ అయినట్లు ఫిర్యాదులో వివరించారు. వీటితో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి ధరావత్ లక్ష్మణ్ నాయక్ ఖాతాకు సుమారు రూ.2 లక్షలు, పంప్ ఆపరేటర్ సయ్యద్ రహీమ్ ఖాతాకు సుమారు రూ.3 లక్షలు బదిలీ చేసినట్లు ఆరోపించారు.

బాత్ రూమ్ ల నిర్మాణానికి రూ.14 లక్షలా?

గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు బాత్‌రూమ్‌ల నిర్మాణానికి ఒక్కొక్కదానికి రూ.7 లక్షల చొప్పున మొత్తం రూ.14 లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కల్లో చూపించారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ నిర్మాణాలకు సంబంధించి వాస్తవంగా ఎంత ఖర్చు చేశారు? పనుల నాణ్యత ఎలా ఉంది? బిల్లులు, చెల్లింపుల్లో పారదర్శకత పాటించారా? అనే అంశాలపై విచారణ జరపాలని కోరుతున్నారు.

ఉపసర్పంచ్ కు తెలియకుండానే నిధుల బదిలీ?

గ్రామపంచాయతీ ఖాతా నుంచి నిధులు బదిలీ చేసే సమయంలో ఉప సర్పంచ్‌కు ఎలాంటి ఓటీపీ, ఎస్ఎంఎస్ సమాచారం అందకుండా బ్యాంకు లావాదేవీలు నిర్వహించారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. బ్యాంకు అధికారులతో కుమ్మక్కై నిధులు మళ్లించారని కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకు స్టేట్‌మెంట్లు, లావాదేవీల అనుమతులు, డిజిటల్ రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ముందుకొస్తే బెదిరింపులు?

మరోవైపు గ్రామంలోని 13వ వార్డు పరిధిలోని చంద్రరావు నగర్ ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు తెలిపారు. సమస్య పరిష్కారానికి ఓ వార్డు నివాసి తన సొంత ఖర్చులతో బోరు వేయించేందుకు ప్రయత్నించగా, సర్పంచ్ భర్త నర్సింహారావు కొంతమందితో అక్కడికి చేరుకొని బోరు వేస్తే బోరు బండిని తగలబెడతానంటూ బెదిరించినట్లు ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రశ్నించిన వార్డు ప్రజలను దుర్భాషలాడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

సర్పంచ్ భర్త పెత్తనంపై విమర్శలు

సర్పంచ్ కమని కుమారి గ్రామంలో నివాసం ఉండకుండా కోదాడలో ఉంటున్నారని, నిధుల లావాదేవీల సమయంలో మాత్రమే గ్రామానికి వస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సర్పంచ్ భర్త నర్సింహారావు గ్రామపంచాయతీ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా, అధికారిక కార్యక్రమాల్లో తానే సర్పంచ్ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కలెక్టర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్

గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామపంచాయతీ బ్యాంకు ఖాతాల లావాదేవీలు, చెక్కులు, బిల్లులు, వౌచర్లు, నిర్మాణ పనుల కొలతల పుస్తకాలు, పనుల నాణ్యతను పరిశీలించి పూర్తి స్థాయి ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఆరోపణలపై విచారణ జరిపించాలని, నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బాసర ప్రసాదానికి ఎలుకల బెడద

- నిద్రమత్తులో ఆలయ అధికారులు!
- భక్తుల ఆరోగ్యానికి బాధ్యులెవరు?
- పవిత్ర ప్రసాదం నిల్వలో కనీస జాగ్రత్తలు కరువు
- నిలదీసిన భక్తుడికి మరో లడ్డూ ఇచ్చి చేతులు దులుపుకున్న సిబ్బంది



నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి తెలంగాణలో అత్యంత ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో అధికారుల పర్యవేక్షణ లోపం బట్టబయలైంది.భక్తులు ఎంతో పవిత్రంగా భావించి స్వీకరించే అమ్మవారి లడ్డూ ప్రసాదం విషయంలో ఆలయ సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మంగళవారం అమ్మవారి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడికి ఏకంగా ఎలుకలు కొరికిన లడ్డూను ప్రసాదంగా విక్రయించడం ఆలయ నిర్వహణ డొల్లతనానికి నిదర్శనంగా నిలిచింది.

నిలదీస్తే తప్పు ఒప్పుకున్న సిబ్బంది

మంగళవారం ఉదయం అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం కౌంటర్ వద్ద ఓ భక్తుడు లడ్డూను కొనుగోలు చేశారు. కవర్ తెరిచి చూడగా,ఆ లడ్డూను ఎలుకలు కొరికి తిన్న ఆనవాళ్లు స్పష్టంగా కనిపించాయి.దీంతో విస్తుపోయిన సదరు భక్తుడు, ఆధారంగా ఉండేందుకు వెంటనే ఆ లడ్డూను ఫోటో తీశారు. అనంతరం కౌంటర్ వద్ద ఉన్న సిబ్బందిని నిలదీయడంతో అసలు విషయం బయటపడింది.తమ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేసిన సిబ్బంది, ఆ లడ్డూను వెనక్కి తీసుకొని వేరే లడ్డూను ఇచ్చారు. అయితే, ఈ క్రమంలో "అవును, ఇక్కడ ఎలుకలు ఉన్నాయి" అని సిబ్బంది తెలియజేయడం వారిని నిలువుటద్దంగా మారింది.నిత్యం వేలాది మంది భక్తులు, ముఖ్యంగా చిన్నారుల అక్షరాభ్యాసాల కోసం సుదూర ప్రాంతాల నుండి బాసరకు తరలివస్తుంటారు. అలాంటి క్షేత్రంలో ప్రసాదాలను నిల్వ చేసే గదుల్లో (స్టోర్ రూమ్) కనీస పారిశుద్ధ్యం, రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎలుకలు కొరికిన ప్రసాదాన్ని తినడం వల్ల భక్తులు, ముఖ్యంగా చిన్నపిల్లలు ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది.

నిద్రమత్తులో ఆలయ కమిటీ, అధికారులు

కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్న బాసర దేవస్థానంలో కనీసం ప్రసాదం నిల్వ కేంద్రాలకు ఎలుకల బెడద లేకుండా చేయలేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని భక్తులు మండిపడుతున్నారు. కౌంటర్లలో విక్రయించే ముందు ప్రసాదం నాణ్యతను ఎందుకు తనిఖీ చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు.ఈ ఘటనపై ఆలయ కార్యనిర్వహణాధికారి (EO), ఆలయ కమిటీ మరియు ఫుడ్ సేఫ్టీ అధికారులు తక్షణమే స్పందించాలని, బాధ్యులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఆందోళనలు తప్పవని స్థానికులు హెచ్చరిస్తున్నారు.





బుల్లెట్ బండి వివాదం... హుజూర్‌నగర్ ఎస్ఐ సస్పెన్షన్

ప్రజా వాయిస్ | హుజూర్‌నగర్ | నవంబర్ 24 చోరీకి గురైన వాహనం విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న ఆరోపణలపై హుజూర్‌నగర్ ఎస్ఐ చలికంటి నరేష్ సస్పెండ్ అయ్యారు. ఈ వివాదానికి సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపట్టారు.

అసలేం జరిగిందంటే...

హైదరాబాద్‌లోని వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్ (బుల్లెట్) బైక్ చోరీకి గురైంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన వనస్థలిపురం పోలీసులు, సాంకేతిక ఆధారాలతో ఆ బైక్ హుజూర్‌నగర్‌లో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం అక్కడికి చేరుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే స్థానిక నాయకుల ఒత్తిడికి తలొగ్గిన హుజూర్‌నగర్ ఎస్ఐ నరేష్, స్వాధీనం చేసుకున్న ఆ బుల్లెట్ బండిని నిబంధనలకు విరుద్ధంగా మరో వ్యక్తికి తిరిగి అప్పగించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ పరిణామంపై ఆగ్రహం వ్యక్తం చేసిన వనస్థలిపురం పోలీసులు జరిగిన విషయాన్ని సూర్యాపేట జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఉన్నతాధికారుల చర్యలు

మరోవైపు ఈ వ్యవహారం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో పోలీసు శాఖ ప్రతిష్టకు భంగం కలిగే పరిస్థితి ఏర్పడింది. వనస్థలిపురం పోలీసుల ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ ఈ ఘటనపై ప్రాథమిక విచారణకు ఆదేశించారు. విచారణలో ఎస్ఐ నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘన వాస్తవమేనని తేలడంతో జిల్లా ఎస్పీ ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నాగార్జున కాలనీలో కలకలం

- మైనర్ బాలిక పట్ల అసభ్య ప్రవర్తన
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజా వాయిస్ మంచిర్యాల్ క్రైమ్ మంచిర్యాల జిల్లా కేంద్రంలో నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నాగార్జున కాలనీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్న ఓ వ్యక్తి, మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో కాలనీలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.నాగార్జున కాలనీకి చెందిన ఓ బాలిక సరుకుల కోసం స్థానిక కిరాణా షాపునకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుకాణ నిర్వాహకుడు ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో భయభ్రాంతులకు గురైన బాలిక ఇంటికి వెళ్లి తన కుటుంబ సభ్యులకు జరిగిన విషయాన్ని చెప్పింది.ఈ విషయం తెలుసుకున్న బాలిక బంధువులు, స్థానికులు పెద్ద ఎత్తున సదరు కిరాణా దుకాణం వద్దకు చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోపోద్రిక్తులైన స్థానికులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేయడంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.సమాచారం అందుకున్న నస్పూర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. స్థానికుల చెర నుంచి కిరాణా వ్యాపారిని అదుపులోకి తీసుకుని, విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



జాతరనా.. జూద కేంద్రమా?

- అనంతగిరి జాతరలో అక్రమ గేమ్ ల దందా!
- భక్తుల జేబులకు చిల్లులు..
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజా వాయిస్/వికారాబాద్: వికారాబాద్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన అనంతగిరి జాతరలో కొందరు యువకులు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ గేమ్‌లు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జాతరకు తరలివస్తున్న భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని, అమాయకుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ జూదం తరహా ఆటలు ఆడిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.ఇలాంటి కార్యకలాపాలతో జాతర పవిత్రత,ప్రతిష్ట దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు, జాతర నిర్వాహకులు స్పందించి అక్రమ గేమ్‌లను తక్షణమే నిలిపివేయడంతో పాటు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

హనుమాన్ విగ్రహ ధ్వంసంపై హిందూ సంఘాల ఆగ్రహం

.. 'చలో మందమర్రి'కి పిలుపు

ప్రజా వాయిస్ - మంచిర్యాల: మందమర్రిలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న హనుమాన్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై హిందూ సంఘాల ఐక్యవేదిక తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను నిరసిస్తూ 'చలో మందమర్రి' కార్యక్రమానికి పిలుపునిచ్చింది.ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు కళాశాల యాజమాన్యం ప్రభుత్వ వైఖరిపై పలు ప్రశ్నలు సంధించారు.

బాధ్యులెవరు?:

స్టీల్ రాడ్లతో పటిష్టంగా నిర్మించిన హనుమాన్ విగ్రహాన్ని కూల్చివేయాల్సిన అవసరం ఏమొచ్చిందని, ఆ విగ్రహం వల్ల ఎవరికి ఇబ్బంది కలిగిందని ప్రశ్నించారు. ఈ ఘటన వెనుక ఉన్న బాధ్యుల పేర్లను తక్షణమే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కళాశాల ఆవరణలో జరిగిన ఈ ఘటనపై సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల యాజమాన్యం స్పందించి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదా అని నిలదీశారు.

మనోభావాలపై దాడి:

హిందూ దేవాలయాల ఆస్తులు, ఆదాయంతో ప్రభుత్వాలు నడుస్తున్న తరుణంలో హిందువుల ఆరాధ్య దైవాల పట్ల ఎందుకింత చిన్నచూపు అని ఆవేదన వ్యక్తం చేశారు.కేవలం హిందువుల మనోభావాలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దేవతా విగ్రహాలకు జరిగిన ఈ అవమానంపై సంబంధిత అధికారులు, కళాశాల యాజమాన్యం తక్షణమే సమాధానం చెప్పాలని హిందూ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది.





పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

- పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి
- బాధితులకు సత్వర న్యాయం అందించాలి
- ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి
- జంగారెడ్డిపల్లి రాముడు బండ జాతర బందోబస్తు పరిశీలన
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ .

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించి స్టేషన్ పనితీరు, పరిసరాలు, రికార్డుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో సిబ్బంది మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన వాహనాలు, ఇతర క్రైమ్ ప్రాపర్టీని పరిశీలించి వాటి భద్రత, రికార్డుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు ఫోన్ కాల్ రాగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలవాలని ఆదేశించారు. ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నేరాల నియంత్రణ, గ్రామాల భద్రత కోసం 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమం కింద ప్రతి గ్రామంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచుకోవాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం వద్ద నిర్వహిస్తున్న రాముడు బండ జాతరను సీపీ సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును క్షుణ్ణంగా పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ గ్రామీణ సీఐ రవి రాజు, ఎస్ఐ కృష్ణారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్మశాన వాటికా..? సమస్యల నిలయమా.?

- చనిపోయిన వారికీ గౌరవం కరువేనా
- బతికున్నవారికి కనీస సౌకర్యాలు కల్పించలేరా?
- టాయిలెట్లు లేవు.. నీటి వసతి లేదు.. వెలుగులు లేవు
- సామగ్రి భద్రపరిచే గది లేదు.. శిథిలావస్థలో వైకుంఠ రథాలు
- మున్సిపల్ చైర్మన్ , పాలకవర్గం, అధికారుల బాధ్యత ఏంటి, ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పేదెవరు?





ప్రజా వాయిస్, హుజురాబాద్ (నవంబర్ 24): ప్రజలకు రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు కల్పించడం ఎంత ముఖ్యమో.. అంతిమ సంస్కారాలు నిర్వహించే స్మశాన వాటికలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం కూడా అంతే ముఖ్యం. కానీ హుజురాబాద్ పట్టణంలోని స్మశాన వాటిక పరిస్థితి చూస్తుంటే మున్సిపల్ పాలకవర్గం, అధికార యంత్రాంగం ప్రజల కనీస అవసరాల పట్ల ఎంత శ్రద్ధ చూపుతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కుటుంబ సభ్యులను కోల్పోయి పుట్టెడు దుఃఖంతో అంత్యక్రియల కోసం వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేకపోవడం పట్టణ మున్సిపల్ నిర్వహణ తీరుపై తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

అంతిమ సంస్కారాలకూ అవస్థలేనా?

స్మశాన వాటికలో కనీసం టాయిలెట్లు లేకపోవడం, తాగునీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడం, రాత్రి వేళల్లో తగిన విద్యుత్ దీపాలు లేకపోవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అంత్యక్రియలకు అవసరమైన సామగ్రిని భద్రపరిచేందుకు ప్రత్యేక గది లేకపోవడం, నిర్వహణకు ప్రత్యేక సిబ్బంది కొరత, వైకుంఠ రథాలు శిథిలావస్థకు చేరడం వంటి సమస్యలు ఉన్నట్లు బీసీ జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు జీవితంలో ఒక్కసారైనా తప్పనిసరిగా వెళ్లాల్సిన ప్రదేశం స్మశాన వాటిక. అలాంటి చోట కూడా కనీస వసతులు కల్పించలేని పరిస్థితి నెలకొంటే పట్టణ అభివృద్ధి గురించి పాలకులు చెబుతున్న మాటలకు అర్థమేంటి? అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు, ప్రచార కార్యక్రమాలేనా? ప్రజల చివరి ప్రయాణానికి అవసరమైన గౌరవప్రదమైన వాతావరణం కల్పించడం కూడా మున్సిపాలిటీ బాధ్యత కాదా.?

చైర్మన్ , పాలకవర్గం ఏం చేస్తున్నట్లు?

మున్సిపల్ పరిధిలోని ప్రజా సౌకర్యాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత పాలకవర్గంపై, సంబంధిత అధికారులపై ఉంటుంది. స్మశాన వాటికలో టాయిలెట్లు, నీటి వసతి, విద్యుత్ దీపాలు, సామగ్రి నిల్వ గది, వైకుంఠ రథాల నిర్వహణ వంటి అంశాలు పరిష్కరించలేనంత పెద్ద సమస్యలా? ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న మున్సిపాలిటీ వారికి కనీస అవసరాలు కల్పించడంలో ఎందుకు వెనుకబడుతోంది? స్మశాన వాటిక నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ ఉందా? కేటాయించిన నిధులు ఎంత? ఖర్చు చేసిన మొత్తం ఎంత? పనుల పర్యవేక్షణ ఎవరి బాధ్యత? ఈ ప్రశ్నలకు మున్సిపల్ పాలకవర్గం, అధికారులు బహిరంగంగా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

ప్రజల అంతిమ హక్కులకు బాధ్యత వహించాల్సిందే

స్మశాన వాటిక అనేది నిర్లక్ష్యానికి వదిలేసే ప్రదేశం కాదు. ప్రజల గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలకు అవసరమైన వసతులు కల్పించడం స్థానిక సంస్థల ప్రాథమిక పౌర సేవల్లో భాగం. తెలంగాణ మున్సిపాలిటీల చట్టం, 2019 ప్రకారం మున్సిపల్ పరిధిలో ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, పారిశ్రామికేతర ప్రజా సదుపాయాలు, మౌలిక వసతుల నిర్వహణకు సంబంధించిన బాధ్యతలను సంబంధిత నిబంధనల ప్రకారం నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో స్మశాన వాటిక నిర్వహణపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలను తేలిగ్గా తీసుకోకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

బీసీ జేఏసీ డిమాండ్, తక్షణమే స్పందించాలి..

హుజురాబాద్ బీసీ జేఏసీ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షులు సందేల వెంకన్న మాట్లాడుతూ పట్టణంలోని స్మశాన వాటికలో నెలకొన్న దుస్థితిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దుఃఖంలో ఉన్న ప్రజలకు కనీస వసతులు కల్పించకపోవడం బాధాకరమన్నారు. స్మశాన వాటికను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది పార్కును తలపించేలా అభివృద్ధి చేయాలని కోరారు. ప్రత్యేక నిర్వహణ సిబ్బందిని నియమించి, తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ దీపాలు, సామగ్రి నిల్వ గది ఏర్పాటు చేయాలని, శిథిలావస్థలో ఉన్న వైకుంఠ రథాలను మరమ్మతు చేయాలని లేదా కొత్తవి సమకూర్చాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్, పాలకవర్గం, అధికారులు ఇప్పటికైనా మేల్కొని తక్షణ చర్యలు చేపట్టాలని, కేవలం హామీలతో కాలయాపన చేయకుండా పనులకు గడువు ప్రకటించాలని బీసీ జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఉపాధ్యక్షులు మామునూరి ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి కుమార్, అంబేద్కర్ సంఘం నాయకులు రామ్ సారయ్య, నాసాని కేశవ, ఆమద్ పాషా, ఆర్.ఎం.పి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జి.పి.ఓ నుంచి ఆర్డీఓ వరకు.. స్థానికంగా ఉంటున్నారా?

- ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు ఎక్కడ?
- విధుల నిర్వహణపై పర్యవేక్షణ ఉందా?
- గ్రామస్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు అధికారుల నివాసాలపై ఆరా
- ప్రభుత్వ భూముల వ్యవహారంలో ఎకరాకు రూ.30 వేల వసూళ్ల ఆరోపణలు.. వాస్తవమెంత?
- పంచనామా భూములకూ డబ్బులు చేతులు మారుతున్నాయా?
- పేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు ఉపయోగపడుతున్నాయా?
- అధికారుల హాజరు, నివాసం, విధులపై కలెక్టర్ ప్రత్యేక సమీక్ష చేపట్టాలంటున్న ప్రజలు



ప్రజా వాయిస్ మంథని ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ శాఖల అధికారులను నియమించింది. అయితే మంథని డివిజన్ పరిధిలో అధికారులు ప్రజలకు ఎంతవరకు అందుబాటులో ఉంటున్నారనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి. గ్రామస్థాయిలో జి.పి.ఓ నుంచి మండల స్థాయిలో ఎంపీడీఓ, తహసీల్దార్, డివిజన్ స్థాయిలో ఆర్డీఓ వరకు అధికారులు తమ విధుల పరిధిలో స్థానికంగా నివాసం ఉంటున్నారా? ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉంటున్నారా? అనే అంశాలపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

జి.పి.ఓలు గ్రామాల్లో ఉంటున్నారా?

గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేందుకు నియమితులైన జి.పి.ఓలు ప్రతిరోజూ గ్రామ పంచాయతీ కార్యాలయాలకు హాజరవుతున్నారా? వారికి కేటాయించిన గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నారా? ఎంత దూరం నుంచి విధులకు వస్తున్నారు? గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారా? లేక మండల కార్యాలయాలకే పరిమితమవుతున్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. జి.పి.ఓల హాజరు, విధుల నిర్వహణపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారా లేదా అన్నది కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు తమ విధుల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండటం ఎంతో ముఖ్యం. గ్రామస్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు పనిచేస్తున్న అధికారులు స్థానికంగా నివాసం ఉంటున్నారా? ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్నారా? కార్యాలయ సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటున్నారా? అత్యవసర సమయాల్లో ప్రజల సమస్యలపై స్పందిస్తున్నారా? అనే అంశాలపై సమీక్ష జరగాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వెళ్లినప్పుడు అధికారులు అందుబాటులో లేకపోతే వారి పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల హాజరు, విధుల నిర్వహణతో పాటు స్థానికంగా వారి అందుబాటుపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. మరోవైపు మంథని డివిజన్ పరిధిలో ప్రభుత్వ భూముల కేటాయింపులు, పంచనామా భూముల వ్యవహారంపై కూడా పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూముల విషయంలో ఎకరాకు రూ.30 వేల వరకు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. పంచనామా ద్వారా పేదలకు కేటాయించిన భూములకు సైతం డబ్బులు చేతులు మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు ఈ వ్యవహారంలో ఎవరి ప్రమేయం ఉంది? డబ్బులు ఎవరు అడుగుతున్నారు? ఎవరు తీసుకుంటున్నారు? అనే విషయాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఇప్పటివరకు అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది.

పేదల భూములు.. రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు మార్గమా?

ప్రభుత్వ భూములను భూమిలేని నిరుపేదలకు కేటాయిస్తే వారు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందే అవకాశం ఉంటుంది. అలాంటి భూములు నిజమైన అర్హులకే అందుతున్నాయా? కేటాయించిన భూములను లబ్ధిదారులే సాగు చేసుకుంటున్నారా? లేక కొందరు వాటిని ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పేదలకు జీవనాధారంగా నిలవాల్సిన ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు ఉపయోగపడుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ అంశంపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ భూముల కేటాయింపుల్లో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు స్పందించాల్సిన బాధ్యత ఉంది. జి.పి.ఓల విధుల నిర్వహణపై పర్యవేక్షణ ఎవరు చేస్తున్నారు? గ్రామస్థాయిలో జరుగుతున్న వ్యవహారాలు మండల అధికారులకు తెలియడం లేదా? రెవెన్యూ భూముల కేటాయింపులపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారా? ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. మంథని డివిజన్ పరిధిలో జి.పి.ఓల నుంచి ఆర్డీఓ స్థాయి వరకు అధికారుల విధుల నిర్వహణ, హాజరు, స్థానికంగా అందుబాటు, ప్రభుత్వ భూముల కేటాయింపులు, పంచనామా ప్రక్రియపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారుల హాజరు రికార్డులు, విధుల నిర్వహణ వివరాలు, ప్రభుత్వ భూముల కేటాయింపు పత్రాలు, లబ్ధిదారుల జాబితాలు, భూముల ప్రస్తుత వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు సేవలు అందించాల్సిన అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి. పేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూములు అర్హులకే దక్కాలి. ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత ఉండాలి. జి.పి.ఓ నుంచి ఆర్డీఓ వరకు అధికారులు స్థానికంగా ఉంటున్నారా? ప్రభుత్వ భూముల వ్యవహారంలో ఎకరాకు రూ.30 వేల వసూళ్ల ఆరోపణల్లో వాస్తవమెంత? పంచనామా భూములపై వస్తున్న ఆరోపణల వెనుక నిజాలేమిటి? ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. జిల్లా యంత్రాంగం స్పందించి నిష్పక్షపాత విచారణ చేపడుతుందా? ప్రజలకు వాస్తవాలు వెల్లడిస్తుందా? అన్నది వేచి చూడాలి.



సరదా ప్రయాణం.. విషాదాంతం.!

- లారీ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు
- అడ్లూరు శివారులో ఘోర రోడ్డు ప్రమాదం
- లారీ ఢీకొని ఏడో తరగతి విద్యార్థి దుర్మరణం
- స్నేహితుడితో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదం
- ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోయి కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



ప్రజా వాయిస్,కోదాడ: ఆ బాలుడి సరదా ప్రయాణం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లిన ఏడో తరగతి విద్యార్థిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. కోదాడ మండలం అడ్లూరు గ్రామ శివారులో మంగళవారం జరిగిన ఈ ప్రమాదం గుడిబండ గ్రామంలో విషాదాన్ని నింపింది.స్థానికుల వివరాల ప్రకారం.. గుడిబండ గ్రామానికి చెందిన షేక్ నాగుల్ (14) తన స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, కోదాడ నుంచి మేళ్లచెరువు వైపు వెళ్తున్న లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగుల్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. స్థానికులు మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.ఒక్కగానొక్క కొడుకు.. తీరని శోకంఅల్లారుముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కుమారుడు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. చేతికి అందివస్తాడనుకున్న బిడ్డ అర్ధాంతరంగా తనువు చాలించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనతో గుడిబండ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అభివృద్ధి ముసుగులో 'పచ్చని' కోత

- అటవీ అధికారుల కళ్లకు గంతలు కట్టారా?
- 50 చెట్ల నరికివేత వెనుక మతలబేంటి!

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి ఒకవైపు ఎల్–నినో ప్రభావంతో వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రజలను భయపెడుతుంటే.. మరోవైపు ప్రకృతిని కాపాడాల్సిన ప్రభుత్వ యంత్రాంగమే మొద్దునిద్రలో జోగుతోంది.'అభివృద్ధి' అనే ముసుగులో పచ్చని చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికివేస్తున్నా అటవీ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని ఫకీర్ నాయక్ తండా రహదారి వెంబడి ఏకంగా 50 భారీ వృక్షాలను కాంట్రాక్టర్ నేలమట్టం చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది.అనుమతులు ఉన్నాయా?.. అడిగే వారే లేరా?.ఫకీర్ నాయక్ తండా రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా,రోడ్డుకు అడ్డుగా ఉన్నాయనే సాకుతో కాంట్రాక్టర్ ఏళ్ల తరబడి నీడనిచ్చిన 50 పచ్చని చెట్లను నిమిషాల్లో కూల్చివేశారు. నిబంధనల ప్రకారం ఒక్క చెట్టును నరకాలన్నా అటవీ శాఖ, రెవెన్యూ అధికారుల ముందస్తు అనుమతులు తప్పనిసరి.అంతేకాకుండా నరికిన చెట్లకు బదులుగా కొత్త మొక్కలు నాటాలి. కానీ ఇక్కడ ఎలాంటి నిబంధనలు పాటించకుండానే ఇంత పెద్ద ఎత్తున వృక్షాల ఊచకోత జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం వెనుక ఆంతర్యమేమిటి?

కళ్ల ముందే 50 చెట్లు నేలకొరిగి, రోడ్డు బోసిపోయినా సంబంధిత అటవీ శాఖ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రకృతిని రక్షించాల్సిన అధికారులే ఇలా చోద్యం చూస్తుండటం వెనుక ఏమైనా ఒత్తిళ్లు ఉన్నాయా? లేక కాంట్రాక్టర్‌తో కుమ్మక్కయ్యారా? అని పర్యావరణ ప్రేమికులు, స్థానికులు నిలదీస్తున్నారు. ఎల్–నినో ఎఫెక్ట్‌తో భవిష్యత్తులో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరికలు వస్తున్న తరుణంలో,ఉన్న చెట్లను కాపాడుకోవాల్సింది పోయి ఇలా ఖతం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రజలు మండిపడుతున్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్,అటవీ శాఖ ఉన్నతాధికారులు నిద్రమత్తు వీడి ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఫకీర్ నాయక్ తండా వాసులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా పచ్చదనాన్ని నాశనం చేసిన కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.







గుండం శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

- ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- ప్రత్యేక పూజలు, దీపారాధనలు

ప్రజా వాయిస్ | కొత్తగూడ:కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుండం గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి.ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి భక్తితో దీపారాధనలు చేశారు. కొత్తగూడ మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.



ఒక్కరోజు సెలవుతో మూతపడిన బీసీ బాలికల వసతి గృహం!

- వార్డెన్ నిర్లక్ష్యమా..? అధికారుల పర్యవేక్షణ లోపమా..?

ప్రజా వాయిస్ / మునుగోడు:మునుగోడు మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహం ఒక్కరోజు సెలవు కారణంగా మూతపడిన ఘటన చర్చనీయాంశంగా మారింది. కార్తీక మాసం సందర్భంగా వార్డెన్ విద్యార్థినులను వారి ఇళ్లకు పంపించినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న బాలికలకు వసతి, భోజన సదుపాయాలు లేకుండా పోయినట్లు సమాచారం.ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థినులకు సెలవు రోజుల్లోనూ అవసరమైన వసతి, భోజన సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉంటుంది. అలాంటిది ఒక్కరోజు సెలవు పేరుతో విద్యార్థినులను ఇళ్లకు పంపించి హాస్టల్‌కు తాళం వేయడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థినుల సంక్షేమం, చదువుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన వసతి గృహంలో ఇలాంటి పరిస్థితులు నెలకొనడం పలు అనుమానాలకు తావిస్తోంది. వార్డెన్ బాధ్యతారాహిత్యమా? లేక సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపమా? అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.వసతి గృహాల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఈ ఘటనను ఎలా గుర్తించలేకపోయారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని, హాస్టల్ మూసివేతకు గల కారణాలను నిగ్గు తేల్చి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డ్యూటీ డొల్ల.. జీతాలు ఫుల్.!

- కోదాడ ఇరిగేషన్ లో అంతా గప్ చుప్.!!
- రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ లో ఒకరికి బదులు మరొకరు విధులు నిర్వహిస్తున్నారంటూ ఆరోపణలు
- ఏళ్ల తరబడి ఇదే తంతు నడుస్తోందా.? అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు
- విధులు చేసేది ఒకరు.. జీతాలు పొందేది మరొకరా.? చెల్లింపులపై ప్రశ్నలు
- ఏఈ, డీఈ, ఈఈలకు తెలియదా.? తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా.?
- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి
- గత రికార్డులపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



ప్రజా వాయిస్,కోదాడ:ప్రభుత్వ ఉద్యోగం అంటే బాధ్యతతో విధులు నిర్వహించాలి. ప్రజాధనం నుంచి జీతాలు తీసుకుంటున్నప్పుడు నిబంధనల ప్రకారం విధులకు హాజరుకావాలి. కానీ కోదాడ ఇరిగేషన్ శాఖలో ఇందుకు భిన్నంగా జరుగుతోందా, ఒకరు చేయాల్సిన ఉద్యోగాన్ని మరొకరు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఇప్పుడు పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలో ఇద్దరు ఉద్యోగుల విధుల నిర్వహణపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఒకరికి బదులు మరొకరు!

రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్‌లో ఒక ఉద్యోగికి బదులుగా మరొకరు విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారం ఒక్క రోజుతో మొదలైందా, లేక కొన్నేళ్లుగా కొనసాగుతోందా, అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ఉద్యోగుల విధుల నిర్వహణలో ఇలాంటి పరిస్థితులు ఉంటే పర్యవేక్షణ వ్యవస్థ ఏం చేస్తున్నట్లు అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఏఈ, డీఈ, ఈఈలకు తెలియదా.?

ఉద్యోగుల హాజరు, విధుల నిర్వహణను పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత ఏఈ, డీఈ, ఈఈ అధికారులదే. అలాంటప్పుడు ఈ వ్యవహారం వారి దృష్టికి రాలేదా. వచ్చినా పట్టించుకోవడం లేదా, అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్ని రోజులుగా జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతున్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎందుకు కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

జీతాల బిల్లులు ఎలా ఆమోదం పొందుతున్నాయి.?

విధులు నిర్వహిస్తున్నది ఒకరైతే, ఉద్యోగ రికార్డుల్లో మరొకరి పేరు ఉంటుందా.. ప్రతి నెలా జీతాల బిల్లులు ఎవరి ధ్రువీకరణతో ఆమోదం పొందుతున్నాయి. ఉద్యోగుల హాజరు పట్టికలను సక్రమంగా పరిశీలిస్తున్నారా.. అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఆరోపణలు నిజమైతే ప్రభుత్వ ఖజానాకు జరిగిన నష్టంపై కూడా విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

ఎన్నేళ్లుగా సాగుతున్న తతంగం.?

ఈ వ్యవహారం ఎప్పటి నుంచి కొనసాగుతోంది. ఇప్పటివరకు ఎంతమంది జీతాలు పొందారు. విధుల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించారా.. అధికారుల పాత్ర ఏమైనా ఉందా, అనే ప్రశ్నలు కోదాడలో చర్చకు వస్తున్నాయి. ఆరోపణల్లో వాస్తవాలు నిగ్గుతేల్చేందుకు గత కొన్నేళ్ల హాజరు రికార్డులు, జీతాల బిల్లులు, విధుల కేటాయింపు వివరాలను పరిశీలించాల్సి ఉంది.

కలెక్టర్ జోక్యం చేసుకోవాలి!

రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్‌లో ఉద్యోగుల విధుల నిర్వహణపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. సమగ్ర విచారణ జరిపి ఆరోపణలు నిజమని తేలితే బాధ్యుల నుంచి నిబంధనల ప్రకారం జీతాల రికవరీ చేపట్టి, విధుల నుంచి తొలగింపుతో సహా తగిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల విధుల నిర్వహణలో పారదర్శకతకు ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే

శ్రమకు గుర్తింపు.. ప్రవీణ్‌కు అధ్యక్ష పదవి



మొయినాబాద్ (ప్రజావాయిస్):బీజేపీ మొయినాబాద్ మున్సిపాలిటీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా కంజర్ల ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం మున్సిపాలిటీ బీజేపీ పార్టీ అధ్యక్షుడు మాదాపురం శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం నియామక పత్రం అందజేసి ప్రవీణ్ కుమార్‌ను శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా కేఎస్ రత్నం మాట్లాడుతూ.. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని, ప్రవీణ్ కుమార్ ఎస్సీ మోర్చాను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.అనంతరం తనను ఎంపిక చేసిన పార్టీ నేతలకు ప్రవీణ్ కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ పటిష్టత కోసం పాటుపడుతానని చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు

- చిమ్మ చీకట్లను తలపిస్తున్న వీధులు
- స్థానికులకు తప్పని తిప్పలు



ప్రజా వాయిస్ చర్ల:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పంచాయతీ పరిధిలోని రైస్ పేట గ్రామంలో వీధుల్లో కొన్ని విద్యుత్ దీపాలు గత కొంతకాలంగా వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు రాత్రి అయితే ఆ ప్రదేశాల్లో చిమ్మ చీకట్లను తలపిస్తున్నాయి ఇటీవల తుఫాను ప్రభావంతో వర్షాలు పడడంతో వీధుల్లో పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు కొన్ని విద్యుత్ స్తంభాలకు తీగలు అల్లుకుపోయి దర్శనమిస్తున్నాయి వీధి దీపాలు వెలగక పోవటంతో రాత్రి వేళల్లో ఆ ప్రదేశంలో నడవాలంటే స్థానికులు, పిల్లలు, మహిళలు,వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వెలగని వీధి దీపాలను మరమ్మత్తులు చేసే నాధుడే కరువయ్యాడని స్థానికులు వారి ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు ఒక పక్క తెలంగాణ ముఖ్యమంత్రి వీధి దీపాల ఏర్పాటు,నిర్వహణ బాధ్యత సర్పంచులదే అని స్పష్టం చేసిన ఆ ఆదేశాలు అమలు కావడం లేదని విమర్శలు ప్రజల్లో వెల్లువెత్తుతున్నాయి ఇకనైనా వీధుల్లో వెలగని వీధి దీపాలకు మరమ్మత్తులు చేసి వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని పాలకులను,సంబంధిత అధికారులను కాలనీవాసులు, స్థానికులు కోరుతున్నారు



క్రీడా ప్రతిభతో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- బేస్ బాల్ జిల్లా జట్ల ఎంపికలో నూకల కవితా వేణుగోపాల్ రెడ్డి

ప్రజావాయిస్ | మిర్యాలగూడ: క్రీడాకారులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వార్డు కౌన్సిలర్ నూకల కవితా వేణుగోపాల్ రెడ్డి ఆకాంక్షించారు. ఇంటర్ డిస్ట్రిక్ట్ బేస్‌బాల్ పోటీలకు సంబంధించి నల్గొండ జిల్లా జట్ల ఎంపిక మంగళవారం మిర్యాలగూడలో నిర్వహించారు.జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరావతి సైదులు, చిర మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 170 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జూనియర్, సీనియర్ పురుషులు, మహిళల జట్లకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఎంపికైన జూనియర్ క్రీడాకారులు డిసెంబర్ 11 నుంచి 14 వరకు కోదాడలోని కేఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొనున్నారు. అదేవిధంగా సీనియర్ జట్ల క్రీడాకారులు డిసెంబర్ 23 నుంచి 26 వరకు సంగారెడ్డి జిల్లాలో జరిగే టోర్నమెంట్‌లో నల్గొండ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాశం నర్సింహారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ జంగా లక్ష్మణ్ యాదవ్, పీడీలు సుజాత, మంజుల, పృథ్వి, శేఖర్, మురళీ, పరమేష్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



నకిలీ నంబర్ ప్లేట్లపై ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం

- 5 క్రిమినల్ కేసులు నమోదు
- ఫేక్, ట్యాంపరింగ్ నంబర్ ప్లేట్ల వాహనాలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్
- చలాన్ల నుంచి తప్పించుకునేందుకు వాహనాల అసలు గుర్తింపును మారుస్తున్నట్లు గుర్తింపు
- హైదరాబాద్ మహంకాళి సహా నాలుగు జిల్లాల్లో క్రిమినల్ కేసులు నమోదు
- పలు వాహనాలు సీజ్‌ప్రభుత్వ అనుమతి పొందిన హెచ్ఎస్ఆర్ పీ (HSRP) నంబర్ ప్లేట్లనే వినియోగించాలని సూచన
- నిబంధనలు ఉల్లంఘిస్తే జీరో టాలరెన్స్ విధానంతో కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

ప్రజా వాయిస్, హైదరాబాద్:నకిలీ, ట్యాంపరింగ్ చేసిన నంబర్ ప్లేట్లతో రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. సోమవారం నగరవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు.. నిబంధనలు ఉల్లంఘించిన పలు వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకునేందుకు, వాహనాల అసలు గుర్తింపును దాచేందుకు కొందరు వాహనదారులు నకిలీ నంబర్ ప్లేట్లను వినియోగిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది.

ఐదు చోట్ల క్రిమినల్ కేసుల నమోదు

వారం రోజులుగా సాగుతున్న ప్రత్యేక తనిఖీల్లో భాగంగా ఫేక్ నంబర్ ప్లేట్లను ఉపయోగించిన వారిపై పోలీసులు 5 క్రిమినల్ కేసులను నమోదు చేశారు. హైదరాబాద్‌లోని మహంకాళి పోలీస్ స్టేషన్‌తో పాటు కామారెడ్డి టౌన్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల, వికారాబాద్ జిల్లా దుద్యాల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడ్ పోలీస్ స్టేషన్లలో ఈ కేసులు నమోదయ్యాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

వాహనదారులు కేవలం ప్రభుత్వ అనుమతి పొందిన హెచ్ఎస్ఆర్పీ (HSRP) నంబర్ ప్లేట్లను మాత్రమే వినియోగించాలని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. నంబర్లను తొలగించడం, ట్యాంపరింగ్ చేయడం లేదా స్టిక్కర్లతో తాత్కాలిక నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేయడం పూర్తిగా చట్టవిరుద్ధమని హెచ్చరించారు. నకిలీ నంబర్ ప్లేట్ల విషయంలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తున్నామని, నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని తేల్చిచెప్పారు. నగరవ్యాప్తంగా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

ప్రయాణం కాదు.. ప్రాణాలతో చెలగాటం!

- భైంసా-కుభీర్ రహదారి నిర్లక్ష్యానికి బలయ్యేదెవరు?
- టెండర్లు పూర్తయినా తట్టెడు మట్టి పడలేదు
- భైంసా-కుభీర్ రోడ్డుపై అధికారుల 'మౌన' వ్రతమెందుకు?
- అంబులెన్స్ లకూ తప్పని నరకం
- కాంట్రాక్టర్ అలసత్వంపై అధికారుల ఉదాసీనత ఎందుకు?





నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి నిర్మల్ జిల్లాలోని అత్యంత కీలకమైన అంతరాష్ట్ర రహదారి భైంసా – కుభీర్ రోడ్డు నేడు అక్షరాలా మృత్యుమార్గంగా మారింది.ఈ రహదారి అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తిగా ముగిసి, కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించినట్లు అధికారిక రికార్డులే స్పష్టం చేస్తున్నాయి. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో నేటికీ తట్టెడు మట్టి కూడా పడకపోవడంపై ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికారుల ఉదాసీనత,కాంట్రాక్టర్ అలసత్వం వెరసి సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి.అధికారులు కాగితాలపై లెక్కలు చూపుతుంటే,క్షేత్రస్థాయిలో సామాన్య జనం మాత్రం అడుగడుగునా ఉన్న భారీ గుంతలతో నరకయాతన అనుభవిస్తున్నారు.మండల కేంద్రంతో పాటు పదుల సంఖ్యలో గ్రామాల ప్రజలు, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు వెళ్లే వాహనాలు నిత్యం ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తాయి.రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు,ఆటో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు.అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీ స్త్రీలను, రోగులను భైంసా ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్‌లు కూడా ఈ గుంతల రోడ్డుపై అతికష్టం మీద ప్రయాణించాల్సి వస్తోంది.నిత్యం భైంసాకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు,ఉపాధ్యాయులు ఈ రోడ్డుపై ప్రయాణించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా?టెండర్ నిబంధనల ప్రకారం సొంత యంత్రాలు,సాంకేతిక సిబ్బంది,ఆర్థిక సామర్థ్యం ఉన్నట్లు పత్రాలు సమర్పించి, అదీ అంచనా కంటే ఎక్కువ రేటుకు కాంట్రాక్టు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ పనులు ఎందుకు ప్రారంభించడం లేదు? నెలలు గడుస్తున్నా పనులు మొదలుపెట్టని కాంట్రాక్టర్‌పై ఆర్&బీ (R&B) అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?ప్రజలు నిలదీసినప్పుడల్లా సాకులు చెబుతూ కాలయాపన చేయడం వెనుక ఆంతర్యమేమిటని ప్రజాసంఘాలు సూటిగా ప్రశ్నిస్తున్నాయి.

తక్షణమే మేల్కొనకపోతే ప్రజాగ్రహం తప్పదు!

అధికారిక ఆధారాలు కళ్లముందే ఉన్నందున,నిర్మల్ జిల్లా కలెక్టర్ మరియు ఆర్&బీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకుని, తక్షణమే భైంసా–కుభీర్ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఈ ప్రాంత ప్రజలు హెచ్చరిస్తున్నారు.



బిల్కల్ సత్యధామంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

ప్రజావాయిస్/మర్పల్లి:

మండలం లోని బిల్కల్ గ్రామ శివారులోని సత్యధామంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త, హైకోర్టు న్యాయవాది ఎం,వి,దుర్గాప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.దార్లపల్లి, తుమ్మలపల్లి, బిల్కల్, మల్లిఖార్జునగిరి గ్రామాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట, ఆరూర్ ప్రాంతాలకు చెందిన పలువురు దంపతులు సత్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సామూహిక వ్రతాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంలో పూజలు,అన్నదానం ఏర్పాటు చేశారు, భక్తులు, మహిళలు, చిన్నారులు కార్తీక దీపాలు వెలిగించారు ఈ కార్యక్రమంలో న్యాయవాది శ్రీనివాస్ రావు, అర్చకులు శ్రీమాన్ పంతులు ఆయ గ్రామాల భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



7వ జాతీయ స్థాయి కుంగ్ ఫూ, కరాటే పోటీల్లో బెల్లంపల్లి క్రీడాకారుల హవా

11 బంగారు, 2 రజత పతకాలతో సత్తా చాటిన చిన్నారులు

ప్రజా వాయిస్ బెల్లంపల్లి టౌన్

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన 7వ జాతీయ స్థాయి కుంగ్ ఫూ, కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో బెల్లంపల్లి క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. వివిధ విభాగాల్లో పోటీపడి మొత్తం 11 బంగారు పతకాలు, 2 రజత పతకాలను కైవసం చేసుకుని బెల్లంపల్లి కీర్తి ప్రతిష్టలను జాతీయ స్థాయిలో నిలబెట్టారు. మహిరా, అనన్య, సమన్వి, దీక్ష, లక్ష్మి ప్రణవి, అక్షర, సాయి ప్రణిత, ప్రణవ్ కృష్ణ, యువన్, అన్విత్ మొత్తం 11బంగారు పతకాలు సాధించగా, హన్విక, ఆరున్య రజత పతకాలు సాధించారు.

హోమ్ గార్డుగా విధులు నిర్వహిస్తూనే శిక్షణ:

బెల్లంపల్లిలో పోలీస్ శాఖలో హోమ్ గార్డుగా విధులు నిర్వహిస్తూనే, సమాజ సేవలో భాగంగా పిల్లలకు ఉచితంగా/ప్రత్యేకంగా కరాటే, కుంగ్ ఫూలలో శిక్షణ ఇస్తున్న మాస్టర్ మల్లెపల్లి జితేందర్ కృషిని పలువురు అభినందిస్తున్నారు. ఆయనతో పాటు సీనియర్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన ప్రముఖ మహిళా క్రీడాకారులు మహిళా శిక్షకురాలు గడిపెల్లి ప్రవళిక, స్వీయ రక్షణ మహిళా శిక్షకురాలు మల్లెపల్లి సాయి ప్రసన్న ఆధ్వర్యంలో ఈ క్రీడాకారులు ప్రత్యేక తర్ఫీదు పొంది ఈ ఘనత సాధించారు.





గంధంపల్లి-కొత్తపేట గ్రామపంచాయతీకి రూ.9.98 లక్షల ఎంపీ నిధులు మంజూరు

నిధుల విషయంలో చొరవ చూపిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలకంటి సీతారాంరెడ్డి..

ఎంపీ పోరిక బలరాం నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్, గ్రామస్తులు

ప్రజా వాయిస్, బయ్యారం..

బయ్యారం మండలంలోని గంధంపల్లి–కొత్తపేట గ్రామపంచాయతీ అభివృద్ధికి మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ ఎంపీ ల్యాడ్స్ (MPLADS) 2026–27 నిధుల నుంచి రూ.9.98 లక్షలు మంజూరు చేశారు. ఇందులో లైబ్రరీ భవన మరమ్మతులకు రూ.4.99 లక్షలు, బహిరంగ బావి స్టెయినింగ్, పైప్‌లైన్ పనులకు రూ.4.99 లక్షలు కేటాయించారు.లైబ్రరీ భవనం మరమ్మతులతో విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, బావి, పైప్‌లైన్ పనులతో గ్రామంలో మంచినీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.నిధుల మంజూరుకు కృషి చేసిన ఎంపీ పోరిక బలరాం నాయక్‌కు, ఈ పనుల సాధనలో చొరవ చూపిన బయ్యారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జూలకంటి సీతారాం రెడ్డికి సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు...

రిమ్స్‌లో పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

వైద్యుల సమయపాలన, రోగుల తరలింపు ఆరోపణలపై విచారణ జరపాలి

నూతన డైరెక్టర్, సూపరింటెండెంట్‌కు ఎమ్మార్పీఎస్ వినతి

ప్రజా వాయిస్, ఆదిలాబాద్:

ఆదిలాబాద్ రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రిలో నిరుపేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి వారి ప్రాణాలకు భరోసా కల్పించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నాయకులు కోరారు. రిమ్స్ నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బలరాం చిక్కే, నూతన సూపరింటెండెంట్ సత్యనారాయణలను మంగళవారం ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్య సేవల మెరుగుదల, వైద్యుల సమయపాలన, ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులను తరలిస్తున్నారనే ఆరోపణలు, పొరుగు సేవల సంస్థల పనితీరు, ఆర్థిక అవకతవకల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ మూడు వేర్వేరు వినతిపత్రాలను అందజేశారు.అనంతరం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూడాల స్వామి మాదిగ మాట్లాడుతూ.. రిమ్స్ వేలాది నిరుపేద కుటుంబాలకు వైద్యపరంగా చివరి ఆశ్రయమని పేర్కొన్నారు. కులమత, ఆర్థిక తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. అత్యవసర వైద్య సేవలు, మందులు, వైద్య పరీక్షలు నిరంతరం అందుబాటులో ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు రోగుల ఫిర్యాదుల పరిష్కారానికి పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రజారోగ్య పరిరక్షణలో నూతన యాజమాన్యానికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందని, అదే సమయంలో పేదల వైద్య హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ, రాష్ట్ర సీనియర్ నాయకుడు అన్నెపాగ అశోక్ మాదిగ, కారెం రవి మాదిగ, సిరిసిల్ల భూమయ్య మాదిగ, దుబ్బాక సుభాష్ మాదిగ, గుర్రాల ఆశన్న మాదిగ, గోటిముక్కుల మధుకర్ మాదిగ, గోధుమల అనిల్ మాదిగ, ఆరేపల్లి గణేష్, గజ్జల అశోక్, రోడ్డ గంగన్న, దాసరి అశోక్, చిట్టి రవి, కడదార భూమన్న, తరుడి శంకర్, కాశిపాక విష్ణు మాదిగ తదితరులు పాల్గొన్నారు.



కార్తీక పౌర్ణమి వేళ కొండగట్టులో కోరుకంటి చందర్ గిరిప్రదక్షిణ

- నాలుగోసారి ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొననున్న మాజీ ఎమ్మెల్యే...

- రామగుండం నియోజకవర్గ ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ప్రత్యేక ప్రార్థనలు

ప్రజా వాయిస్ రామగుండం

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయ సన్నిధిలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గిరిప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ప్రతి పౌర్ణమి రోజున కొండగట్టులో గిరిప్రదక్షిణ చేస్తూ వస్తున్న ఆయన, ఈ కార్తీక పౌర్ణమితో నాలుగోసారి ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. ఈ సందర్భంగా రామగుండం నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని శ్రీ ఆంజనేయస్వామివారిని ప్రత్యేకంగా ప్రార్థించనున్నారు. ప్రజల సంక్షేమం, కుటుంబాల అభ్యున్నతి ఆకాంక్షిస్తూ స్వామివారి సన్నిధిలో గిరిప్రదక్షిణ చేయనున్నారు.

60 ఏళ్ల తర్వాత స్వామివారి నిజరూప దర్శనం

మరోవైపు, కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో సుమారు 60 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత 2026 నవంబర్‌లో చందనోత్సవం నిర్వహించడంతో భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పిస్తున్నారు. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 29, 2026 వరకు మొత్తం 40 రోజుల పాటు భక్తులు స్వామివారి అసలు నిజరూపాన్ని దర్శించుకునే అవకాశం కల్పించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా కొండగట్టుకు తరలివచ్చే భక్తులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనున్నాయి.



డిసెంబర్ 7 నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బంది సమ్మెకు సిద్ధం!

కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేసిన శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులు

కనీస వేతనం రూ.26 వేలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్

ప్రజా వాయిస్. మంచిర్యాల

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది, సూపర్‌వైజర్లు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు డిసెంబర్ 7, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటిస్తూ నవంబర్ 23న ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేశారు.ఐహెచ్ఎఫ్ఎంఐఎస్ నుంచి ఐఎఫ్ఎంఐఎస్‌లోకి విలీనం చేయాలి.ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వివిధ విభాగాల కాంట్రాక్టు కార్మికులను ఐహెచ్ఎఫ్ఎంఐఎస్ నుంచి ఐఎఫ్ఎంఐఎస్‌లోకి విలీనం చేయాలని కోరారు. కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.26 వేల స్థిర వేతనం నిర్ణయించి, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.తమ సమస్యల పరిష్కారం కోసం గతంలో పలుమార్లు ధర్నాలు, నిరసనలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందించినప్పటికీ స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కాంట్రాక్టర్లు చాలీచాలని వేతనాలు చెల్లిస్తున్నారని, ఈపీఎఫ్, ఈఎస్ఐ మొత్తాలను సక్రమంగా జమ చేయడం లేదని ఆరోపించారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ వివరాలు, ఖాతా నంబర్లు అడిగిన కార్మికులను కొందరు కాంట్రాక్టర్లు, సంబంధిత వ్యక్తులు వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని విధులకు రావద్దంటూ హెచ్చరిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా నిర్ణీత పని సమయాలకు మించి ఓవర్‌టైమ్ విధులు చేయిస్తున్నారని, కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ సమ్మెకు దిగుతున్నట్లు వెల్లడించారు. కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.26 వేల వేతనం చెల్లించి, డీబీటీ ద్వారా అమలు చేయాలి. బెడ్‌సైడ్ కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలి. ప్రతి కార్మికుడికి రూ.20 లక్షల ప్రమాద బీమా కల్పించాలి. ఈపీఎఫ్‌లో యాజమాన్యం వాటాను ప్రభుత్వం చెల్లించాలి. మహిళా కార్మికులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా క్యాజువల్ సెలవులు మంజూరు చేయాలి. ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ కార్డు అందించాలి. ఇవే కాకుండా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి డిమాండ్లను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె. ఇబ్రహీం, డి. రమేష్, అన్వర్, శ్రీకాంత్, సాయి, చంద్రమౌళి తదితర కార్మికులు పాల్గొన్నారు.



హరహర మహాదేవ్... శంభో శంకర

కార్తీక పౌర్ణమి వేళ కీసరగుట్టలో ఆధ్యాత్మిక సందడి,

కీసరగుట్టలో భక్త జనసందోహం,

కార్తీక దీపాల వెలుగులతో విరజిల్లిన కేసరగిరి క్షేత్రం

తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున కీసరగుట్టకు తరలివచ్చి శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు..

శ్రీ భవాని రామలింగేశ్వర స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు..

శివనామస్మరణతో మార్మోగిన పుణ్యక్షేత్రం





ప్రజావాయిస్, కీసర :

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కీసరగుట్టలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన రోజుగా భావించే కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రమైన కీసరగుట్టకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే శ్రీ రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరడంతో ఆలయ పరిసరాలు భక్తజన సందోహంతో కిటకిటలాడాయి.

కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామివారిని దర్శించుకుంటే పుణ్యఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. దీంతో హైదరాబాద్ నగరంతో పాటు మేడ్చల్, మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి జిల్లాల పరిసర ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా కీసరగుట్టకు చేరుకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు భక్తులు ఆసక్తి చూపారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ ప్రాంగణంలో ఎటుచూసినా భక్తుల సందడే కనిపించింది. హరహర మహాదేవ, ఓం నమః శివాయ అంటూ భక్తులు చేసిన శివనామస్మరణతో కీసరగుట్ట మార్మోగింది. కార్తీక దీపారాధన, శివారాధనకు విశేష ప్రాధాన్యత ఉండటంతో భక్తులు ప్రత్యేక భక్తిభావంతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహిళలు ఆలయం లోపల వెలుపల కార్తీక దీపాలు వెలిగించి మొక్కులను చెల్లించుకున్నారు. కార్తీక దీపాల వెలుగులతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. మహిళలు, వృద్ధులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపాకటాక్షాలు పొందారు.

కార్తీక మాసం ఆధ్యాత్మిక చింతనకు, దైవభక్తికి ప్రతీకగా నిలుస్తుందని, ఈ మాసంలో శివారాధన చేయడం ఎంతో విశిష్టమైనదని భక్తులు పేర్కొన్నారు. ఏడాది పొడవునా కీసరగుట్టకు భక్తులు వస్తున్నప్పటికీ, కార్తీక పౌర్ణమి వంటి పర్వదినాల్లో భక్తుల రద్దీ మరింత పెరుగుతుందని స్థానికులు తెలిపారు. కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం భక్తజన సందోహంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల శివనామస్మరణ, పూజలు, ప్రార్థనలతో పుణ్యక్షేత్రం పరవశించిపోయింది.ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు...

ఘనంగా బ్రహ్మ జ్ఞాన దివస్ వేడుకలు

- క్వాంటం లైఫ్ యూనివర్సిటీ 16వ వార్షికోత్సవంలో డాక్టర్ న్యూటన్ 57వ జన్మదిన వేడుకలు
- గోలోకంలో 22 అడుగుల రాధాకృష్ణ విగ్రహావిష్కరణ..
- యూనివర్సిటీ డైరెక్టర్‌గా ఆచార్య హారిక నియామకం

కోటపల్లి/ప్రజావాయిస్:

క్వాంటం లైఫ్ యూనివర్సిటీ 16వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా బ్రహ్మర్షి చక్రవర్తి డాక్టర్ న్యూటన్ 57వ జన్మదినాన్ని పురస్కరించుకొని 'బ్రహ్మ జ్ఞాన దివస్' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మికత, ధ్యానం, సంస్కృతి, ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన ఈ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా ఆచార్య హారికను క్వాంటం లైఫ్ యూనివర్సిటీ డైరెక్టర్‌గా నియమిస్తున్నట్లు బ్రహ్మర్షి చక్రవర్తి డాక్టర్ న్యూటన్, బ్రహ్మ విద్వర్షిష్ట డాక్టర్ లక్ష్మి ప్రకటించారు. అనంతరం క్యాంపస్‌లోని సుమారు 80 ఆవులతో కూడిన గోలోక ప్రాంగణంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన 22 అడుగుల భారీ రాధాకృష్ణ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు.ప్రముఖ నృత్య కళాకారిణి మొప్ప ప్రీతి సంప్రదాయ నృత్య ప్రదర్శనతో సభను ప్రారంభించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్



న్యూటన్ మాట్లాడుతూ, తన ఆధ్యాత్మిక గురువు బ్రహ్మర్షి పత్రీజీ ఆశయాలు, ధ్యాన సందేశం ఎల్లప్పుడూ తనకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.యూనివర్సిటీలో సహస్రార పిరమిడ్, నూతన గ్రంథాలయం, రహదారులు, బుద్ధ గార్డెన్, పచ్చని వనాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 150కి పైగా దేశాల్లో ధ్యాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.తక్షశిల తరహాలో ప్రస్తుత తరానికి జ్ఞానం, ధ్యానం అందించే నవ్య తక్షశిలగా క్వాంటం లైఫ్ యూనివర్సిటీని తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడించారు. ఈ సంకల్పానికి సహకరిస్తున్న దాతలు, సేవకులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ మేనేజింగ్ ట్రస్టీలు రాజశేఖర్, శ్రీదేవి, బుద్ధ సీఈఓ ఫౌండర్ చంద్ర, వాణి, వసుధ ఫార్మా ఇండస్ట్రీస్ ఛైర్మన్ అశోక్, ప్రతీక్ కోహ్లీ, గణేష్ కోహ్లీ, ఆచార్యులు, ఎన్‌సీటీపీ పార్టిసిపెంట్లు, పరిసర గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.జ్ఞానం, ధ్యానం, ప్రకృతి పరిరక్షణ, ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రతిబింబించిన ఈ వేడుకలు యూనివర్సిటీ వార్షికోత్సవాల్లో చిరస్మరణీయంగా నిలిచాయి.



భక్తిభావంతో కార్తీక పౌర్ణమి..

- శివాలయాల్లో ప్రత్యేక పూజలు..దీపాల వెలుగుల్లో శివక్షేత్రాలు..
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో:

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన రోజుగా భావించే పౌర్ణమి సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి, శివుడికి పాలు, నీరు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగిస్తూ భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.సాయంత్రం వేళ ఆలయాలు, ఇళ్ల వద్ద కార్తీక దీపాలు వెలిగించడంతో పరిసర ప్రాంతాలు దీపకాంతులతో కళకళలాడాయి. కొందరు భక్తులు ఆలయాల్లో దీపారాధన, ప్రదక్షిణలు నిర్వహించి కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు.కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని ప్రధాన శివాలయాలతో పాటు గ్రామీణ ప్రాంత ఆలయాల్లోనూ భక్తుల రద్దీ నెలకొంది. పండుగ వాతావరణం, భక్తుల సందడి, దీపాల వెలుగులతో వికారాబాద్ జిల్లా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

విద్యార్థుల కోరికకు ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పందన

- గడ్డం వంశీకృష్ణ తరపున వసంత రెడ్డి, జావేద్ ఖాన్ క్రీడా సామాగ్రిని పంపిణీ
- మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర హాస్టల్ లో కార్యక్రమం
- విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం
- చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి...విద్యార్థులకు ఎంపీ ఆకాంక్ష

ప్రజా వాయిస్ కాటారం

విద్యార్థుల అవసరాలను గుర్తించి వారి కోరిక మేరకు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ తరపున వసంత రెడ్డి, జావేద్ ఖాన్ క్రీడా సామాగ్రిని అందించారు. మంథని నియోజకవర్గంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర హాస్టల్ విద్యార్థులకు విశాఖ



చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఇటీవల ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాస్టల్‌ను సందర్శించిన సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఈ క్రమంలో తమకు క్రీడా సామాగ్రి అవసరమని విద్యార్థులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన విద్యార్థుల కోరిక మేరకు క్రీడా సామాగ్రి అందజేసేలా చర్యలు తీసుకున్నారు. క్రీడా సామాగ్రి పంపిణీ సందర్భంగా విద్యార్థులతో వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే లక్షణాలు అలవడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో ఇప్పటికే పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ఈ సందర్భంగా తెలిపారు. దివంగత కాకా వెంకటస్వామి ఆశయాలను కొనసాగిస్తూ ఆయన వారసులైన వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రజాసేవతో పాటు సంక్షేమం, సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ వంతు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తమ అవసరాలను గుర్తించి, అడిగిన వెంటనే స్పందించి క్రీడా సామాగ్రి అందించినందుకు హాస్టల్ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా యువజన అధ్యక్షుడు సకినాల ప్రశాంత్, తొంబర్ల రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రాపురంలో పోలీసుల కార్డాన్ అండ్ సెర్చ్

25 లీటర్ల గుడుంబా, 600 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం

సరైన పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలు సీజ్.. ఆరుగురిపై కేసులు

ప్రజా వాయిస్, బయ్యారం:

బయ్యారం మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామపంచాయతీ పరిధిలో గల రామచంద్రాపురం, కొత్తతండా, పెంకుతండా గ్రామాల్లో పోలీసులు కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ తిరుపతిరావు సూచనలతో గార్ల–బయ్యారం సీఐ రవీందర్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా 25 లీటర్ల గుడుంబా, 600 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు సరైన పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఆరుగురిపై కేసులు నమోదు చేశారు.అసాంఘిక కార్యకలాపాలు, నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడమే కార్డాన్ సెర్చ్ ప్రధాన ఉద్దేశమని సీఐ రవీందర్ తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గంజాయి రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ ప్రశాంత్ బాబు కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గార్ల, బయ్యారం ఎస్ఐలు సాయికుమార్, ప్రశాంత్ బాబు, ఇరు పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు..

గూడెం కార్తీక పౌర్ణమి జాతరకు పటిష్ట పోలీస్ బందోబస్తు

భక్తుల భద్రతకు ప్రాధాన్యత..

ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

ప్రజా వాయిస్ గూడెం / దండేపల్లి

మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించనున్న జాతరకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఐపీఎస్ అధికారులను ఆదేశించారు.మంగళవారం జాతర బందోబస్తు ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గూడెం ఆలయ ప్రాంగణంతో పాటు రాయపట్నం గోదావరి ఘాట్ వద్ద భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, క్యూలైన్లు, భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమీక్షించారు.జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి



అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు నిర్వహించాలని సూచించారు. భక్తులు ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకునేలా క్యూలైన్లను క్రమబద్ధీకరించాలని, అవసరమైన చోట అదనపు పోలీసు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు.గోదావరి ఘాట్ వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నదిలోకి భక్తులు వెళ్లకుండా పర్యవేక్షణ చేపట్టడంతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా రక్షణ చర్యలు సిద్ధం చేయాలని ఆదేశించారు.మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రధాన రహదారులు, ఆలయ పరిసర ప్రాంతాల్లో నిరంతర నిఘా కొనసాగించాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు.భక్తుల భద్రతే పోలీసుల ప్రధాన ప్రాధాన్యత అని పేర్కొన్న సీపీ..అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్తీక పౌర్ణమి జాతరను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, బెల్లంపల్లి పన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ సురేష్, దండేపల్లి ఎస్ఐ రాజవర్ధన్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి పర్వదినాన పటేల్‌గూడలో వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

ఈర్ల రాజు స్వగృహంలో ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

పటాన్ చెరువు ప్రజావాయిస్

పవిత్రమైన కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని పటాన్చెరు నియోజకవర్గం, అమీన్పూర్ మండలం, బీరంగూడ డివిజన్ పరిధిలోని పటేల్‌గూడ గ్రామంలో బీరంగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ తన స్వగృహంలో శ్రీ హరిహరపుత్రుడు అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు.కార్తీక పౌర్ణమి వంటి పవిత్రమైన పర్వదినాన తమ స్వగృహంలో ఇంతటి మహత్తరమైన అయ్యప్ప స్వామి మహా పడిపూజను నిర్వహించుకోవడం తమ కుటుంబానికి ఎంతో ఆనందాన్ని, ఆధ్యాత్మిక సంతృప్తిని కలిగించిందని ఈర్ల రాజు ముదిరాజ్ తెలిపారు.తన కుమారుడు ఈర్ల లిఖిల్ ముదిరాజ్ అయ్యప్ప స్వామి మాలధారణ చేసి, గురుస్వాముల మార్గదర్శకత్వంలో సుమారు 1,100 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసుకొని శబరిమల చేరుకుని అయ్యప్ప స్వామి వారి దివ్యదర్శనం చేసుకుని స్వగృహానికి తిరిగి వచ్చిన శుభసందర్భంగా ఈ మహా పడిపూజను నిర్వహించారు.గురుస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, వేదమంత్రోచ్చారణలు, భజనలు,





దీపారాధనలు, పవిత్రమైన 18 మెట్ల పడిపూజ కార్యక్రమాలు భక్తిపారవశ్యంతో జరిగాయి. అనంతరం అయ్యప్ప స్వాములకు, భక్తులకు ఘనంగా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వాములను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు పొందారు.ఈ పవిత్రమైన కార్తీక పౌర్ణమి రోజున మా ఇంట్లో అయ్యప్ప స్వామి వారి మహా పడిపూజ నిర్వహించుకోవడం స్వామివారి అనుగ్రహంగా భావిస్తున్నాము. ఈ కార్యక్రమాన్ని ఇంతటి వైభవంగా నిర్వహించడానికి మార్గదర్శకత్వం వహించిన గురుస్వాములందరికీ మా కుటుంబం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.సనాతన ధర్మం అనేది మన భారతీయ సంస్కృతికి మూలస్తంభం. అయ్యప్ప స్వామి దీక్ష ప్రతి ఒక్కరికీ క్రమశిక్షణ, ఆత్మనిగ్రహం, సమానత్వం, సోదరభావం, సేవాభావం వంటి గొప్ప విలువలను నేర్పిస్తుంది. ముఖ్యంగా నేటి యువత మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ మంచి మార్గంలో నడవాలి.దీక్ష యువతకు క్రమశిక్షణను నేర్పుతుంది.. భక్తి మంచి మార్గాన్ని చూపిస్తుంది.. వ్యసనాలకు దూరంగా ఉండటం ఆరోగ్యకరమైన జీవితానికి పునాది.. సేవాభావం దేశ నిర్మాణానికి బాటలు వేస్తుంది.'ఈ మహా అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వాములు, పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, పటేల్‌గూడ గ్రామంలోని భక్తులు, మహిళలు, యువత, కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

బండ్లగూడ జాగీర్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలు

ప్రజావాయిస్,రాజేంద్రనగర్:



క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి, ప్రాణాపాయ పరిస్థితులను నివారించాలనే లక్ష్యంతో బండ్లగూడ జాగీర్‌లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించనున్నారు. కిస్మత్‌పూర్ డివిజన్‌కు చెందిన నిరుడు పవన్ సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో,బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వారి సహకారంతో నవంబర్ 28న ఈ కార్యక్రమం జరగనుంది.బండ్లగూడ జాగీర్‌లోని ప్రశాంత్ నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా పవన్ సాయి మాట్లాడుతూ..క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే సకాలంలో చికిత్స పొందే అవకాశం ఉంటుందని, వ్యాధి ముదిరే వరకు నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు.ప్రజల్లో క్యాన్సర్‌పై అవగాహన పెంచడంతో పాటు, ఉచితంగా పరీక్షలు చేయించుకునే అవకాశాన్ని కల్పించడమే ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీఎస్‌సీపీఎస్‌ఈయూ బజార్ హత్నూర్ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

మండల అధ్యక్షుడిగా సర్వే అమోల్, ప్రధాన కార్యదర్శిగా గొర్ల అనిల్ కుమార్ నియామకం.

సీపీఎస్ రద్దు చేసి పాత పింఛను విధానాన్ని సాధించేందుకు సంఘటితంగా పోరాడాలని పిలుపు

ప్రజా వాయిస్, / బోథ్ నియోజకవర్గం


TELANGANA STATE CONTRIBUTORY PENSION SCHEME EMPLOYEES UNION

ప్రెస్ నోట్

TSCPSEU బజార్‌హత్నూర్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

తెలంగాణ రాష్ట్ర భాగస్వామ్య పింఛను పథకం ఉద్యోగుల సంఘం (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) జిల్లా అధ్యక్షుడు కాంబ్లే విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం బజార్ హత్నూర్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన మండల అధ్యక్షుడిగా సర్వే అమోల్, ప్రధాన కార్యదర్శిగా గొర్ల అనిల్ కుమార్, కోశాధికారిగా జయవర్ధన్, సామాజిక మాధ్యమ సమన్వయకర్తగా అభిలాష్, కార్యదర్శులుగా పుండలీక్, రాహుల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కాంబ్లే విజయ్ కుమార్ మాట్లాడుతూ... ప్రస్తుత భాగస్వామ్య పింఛను విధానాన్ని (సీపీఎస్) రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించే వరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులంతా సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నూతన కార్యవర్గ సభ్యులు ఉద్యోగ, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంతో పాటు పాత పింఛను సాధన పోరాటంలో ఐక్యంగా ముందుండి నడిపించాలని సంఘం ప్రతినిధులు ఆకాంక్షించారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా

ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వమే పూర్తి ప్రీమియం చెల్లించేలా 18 నుంచి 59 ఏళ్ల వయస్సు గల సంపాదించే వ్యక్తికి వర్తింపు

అర్హత కలిగిన ఏ కుటుంబమూ పథకానికి దూరం కాకుండా క్షేత్రస్థాయిలో కార్యకర్తలు అవగాహన కల్పించాలని పిలుపు

ప్రజా వాయిస్, / బోథ్ నియోజకవర్గం



రాష్ట్రంలోని నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బోథ్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఆలపాటి అచ్యుతానంద్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి అకాల మరణం చెందితే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోకుండా రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన కుటుంబ పెద్దకు ఈ పథకం వర్తిస్తుందని, దీనికి సంబంధించిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు.అర్హులైన లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, చరవాణి సంఖ్య, వారసుల (నామినీ) వివరాలతో గ్రామ పంచాయతీ కార్యాలయం లేదా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక నమోదు కేంద్రాలను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు సమయంలో వివరాలను క్షుణ్ణంగా సరిచూసుకుని, ప్రక్రియ పూర్తయిన తర్వాత రసీదు లేదా గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. బోథ్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ అర్హత గల ప్రతి కుటుంబానికి ఈ పథకం అందేలా బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. సంక్షేమాన్ని కేవలం హామీలకే పరిమితం చేయకుండా ప్రజల జీవితాలకు నిజమైన భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని అచ్యుతానంద్ రెడ్డి పేర్కొన్నారు.

అలుగనూరులో దీక్షా దివస్‌కు భారీ ఏర్పాట్లు...

- నవంబర్ 29న కరీంనగర్‌లో ఉద్యమ స్ఫూర్తి చాటేందుకు బీఆర్ఎస్ భారీ సభ

- ముఖ్య అతిథిగా కేటీఆర్.. తెలంగాణ ఉద్యమ చరిత్రను నూతన తరానికి పరిచయం చేయడమే లక్ష్యం: బోయినపల్లి వినోద్ కుమార్

ప్రజా వాయిస్,బెజ్జంకి (నవంబర్ 24):



తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో కీలక ఘట్టమైన నవంబర్ 29 దీక్షా దివస్‌ను ఈసారి కరీంనగర్ జిల్లా అలుగనూరులో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధమవుతోంది. నవంబర్ 29న సాయంత్రం 4 గంటలకు అలుగనూరు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో బెజ్జంకి మండల పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష చరిత్రను నేటి యువతకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఉద్యమకారుడిపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించడం వెనుక వేలాది మంది విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ప్రజల పోరాటాలు, త్యాగాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఆ ఉద్యమ చరిత్రను భావితరాలకు అందించడమే దీక్షా దివస్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

అలుగనూరుకు ప్రత్యేక చారిత్రక ప్రాధాన్యత

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే సంకల్పంతో కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఉద్యమాన్ని కీలక మలుపు తిప్పిందని సమావేశంలో నాయకులు గుర్తుచేశారు. కరీంనగర్ నుంచి బయలుదేరిన కేసీఆర్‌ను అలుగనూరు వద్ద అరెస్టు చేయడం తెలంగాణ ఉద్యమ చరిత్రలో మరచిపోలేని ఘట్టమని పేర్కొన్నారు. అలాంటి చారిత్రక ప్రాంతంలోనే దీక్షా దివస్ నిర్వహించడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. కేసీఆర్ అరెస్టు అనంతరం తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిందని, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజలు రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో భాగస్వాములయ్యారని తెలిపారు. డిసెంబర్ 9 ప్రకటన, అనంతరం కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం, జేఏసీ ఆధ్వర్యంలో సాగిన ఉద్యమాలు, మిలియన్ మార్చ్, సాగరహారం వంటి పోరాటాలు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి బాటలు వేశాయని వివరించారు.

భారీ సభకు విస్తృత ఏర్పాట్లు

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ అలుగనూరు-గుండ్లూరు మధ్య విశాలమైన సభా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సభా ప్రాంగణం, పార్కింగ్, రహదారులు, విద్యుత్, కుర్చీలు, ప్రజల రాకపోకలకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల కోసం బస్సులు, ఇతర వాహనాల సౌకర్యం కల్పించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు. మానకొండూరు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు, పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివచ్చేలా సమీకరణ చేపడుతున్నట్లు తెలిపారు.

ఉద్యమ చరిత్రను భావితరాలకు అందించాలి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్త తరం ముందుకు వచ్చిందని, రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటాలు, ఉద్యమకారుల త్యాగాలు, కేసీఆర్ దీక్ష వెనుక ఉన్న పరిస్థితులను యువతకు వివరించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. దీక్షా దివస్‌ను కేవలం వార్షిక కార్యక్రమంగా కాకుండా తెలంగాణ ఆత్మగౌరవాన్ని, ఉద్యమ స్ఫూర్తిని చాటే వేదికగా నిర్వహించాలని నిర్ణయించారు. నవంబర్ 29న సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని 6 గంటలలోపు ముగించేలా ప్రణాళిక రూపొందించారు. ఉద్యమ పాటలు, ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించే కార్యక్రమాలతో సభను నిర్వహించనున్నారు. తెలంగాణ ఉద్యమ అభిమానులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు, మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్ గుప్తా, బోయినపల్లి శ్రీనివాసరావు, సర్పంచులు పెద్దన్న, భీమయ్య, శ్రీనివాస్, ఎల శేఖర్ బాబు, రాజు, దేవయ్య, మహేందర్ రెడ్డి, దీటి బాలనర్స్, మహేష్, శంకర్, శివకృష్ణ, సుదర్శన్, భూమయ్య, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్, తిరుపతితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కమ్మవారి వన భోజన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

నల్లబండగూడెంలో ప్రముఖులకు ఆహ్వానాలు.. కరపత్రం ఆవిష్కరణ

ప్రజా వాయిస్,కోదాడ:

ఈ నెల 29న ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న కాకతీయ కమ్మవారి వన భోజన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కోదాడ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న ఈ వేడుకకు కమ్మ కుటుంబాల సోదర సోదరీమణులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామంలో కమ్మ కుటుంబాల ప్రముఖులు, గ్రామ పెద్దలను నిర్వాహకులు కలిసి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి, ఆహ్వానాలు అందజేశారు. అందరూ ఐక్యంగా పాల్గొని వన భోజన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అలసకాని భవాని శరబేశ్వరరావు సర్పంచ్ నల్లబండగూడెం,నలజాల శ్రీనివాసరావు పిఏసిఎస్ చైర్మన్ యర్రవరం,కర్రి.సుబ్బారావు 18వ వార్డు కౌన్సిలర్ ,సాతులూరి.హనుమంతరావు, సాదినేని అప్పారావు,మల్లెల పుల్లయ్య,చిగురుపాటి.సుధాకర్ రావు,చిట్టి బాబు,ముండ్రా. శివరామకృష్ణ,రంగారావు,సీత య్య,వల్లంపాటి.నరసింహారావు, శ్రీను,ముండ్రా.వినయ్ కుమార్ బి సుబ్బారావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్‌ను జేబు కమిషన్‌గా మార్చారా?

బీసీ రిజర్వేషన్ల కోసం మోదీ నివాసం ఎదుట బీజేపీ మహాపాదయాత్ర చేయాలి

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ విమర్శ

ప్రజా వాయిస్ హుస్నాబాద్



బీజేపీ గత 12 సంవత్సరాల పాలనలో దేశ ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దిగజారిందని, ఎన్నడూ లేనివిధంగా రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే పడిపోవడం ఆందోళనకరమని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ విమర్శించారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రతను దెబ్బతీసి, జేబు కమిషన్‌గా మార్చే పరిస్థితి తీసుకొచ్చినందుకు బీజేపీ మహాపాదయాత్ర చేపడుతోందా? అని ఆయన ప్రశ్నించారు.కార్పొరేట్ సంస్థలకు, వ్యాపార రంగాలకు కేంద్ర ప్రభుత్వం అనేక రాయితీలు కల్పించి, పన్నులు తగ్గించినప్పటికీ కొత్త ఉద్యోగాల కల్పన జరగడం లేదని, వేతనాలు కూడా పెరగడం లేదని ప్రధాని మోదీ స్వయంగా ఇటీవల ఫిక్కీ సమావేశంలో మాట్లాడిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దేశంలోని అయోధ్య రామాలయానికి సంబంధించిన నిధుల విషయంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు రావడం, ఈ వ్యవహారంలో ఆర్ఎస్ఎస్ అధినేత నియమించిన కమిటీపై ఆరోపణలు ఉండటం విచారకరమని అన్నారు. మరోవైపు రోడ్లపై జైశ్రీరామ్ నినాదాలు చేస్తూ రాజకీయాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో సుమారు 30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకుండా తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాల్లో తక్కువ వేతనాలతో ఉద్యోగులను కొనసాగించడం మోదీ ప్రభుత్వ వైఫల్యం కాదా? అని రవీందర్ గౌడ్ ప్రశ్నించారు. కార్మిక చట్టాల్లో మార్పులు చేసి కనీస వేతనాల అంశానికి ప్రాధాన్యత తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వమే తక్కువ వేతనాలతో ఉద్యోగులను నియమిస్తుంటే, కార్పొరేట్ సంస్థలు కొత్త ఉద్యోగాలు ఎలా కల్పిస్తాయని, కార్మికులకు మెరుగైన వేతనాలు ఎలా అందిస్తాయని నిలదీశారు.దేశ సంపదలో అధిక భాగం కేవలం పది శాతం మంది బడా కార్పొరేట్ వ్యాపారవేత్తల చేతుల్లోనే కేంద్రీకృతమైతే ఆర్థిక సమానత్వం ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీజేపీ నాయకులు ప్రధాని మోదీ నివాసం వరకు మహాపాదయాత్ర చేపడితే బాగుండేదని సూచించారు. బీసీలకు న్యాయం చేయడంలో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు వెలుపుల రాజు, ఎలగందుల శంకర్, మొగిలిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల సోమన్న హరితవనంలో సందడిగా క్యాంప్ ఫైర్

ప్రకృతి ఒడిలో టెంట్లలో బస.. నక్షత్ర వీక్షణతో మంత్రముగ్ధులైన ప్రకృతి ప్రేమికులు

ప్రజా వాయిస్, బోథ్:

బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం బోథ్ అటవీ రేంజ్ పరిధిలోని కుంటాల సోమన్న హరితవనం (అర్బన్ పార్క్)లో క్యాంప్ ఫైర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అటవీ శాఖ అనుమతితో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రకృతి ప్రేమికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ప్రకృతి ఒడిలో టెంట్లు ఏర్పాటు చేసుకొని రాత్రి బస చేయడంతో పాటు భోగి మంటల చుట్టూ ఆటపాటలతో సందడి చేశారు. ఆకాశంలోని నక్షత్రాలను వీక్షిస్తూ, అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్ చేస్తూ సూర్యోదయం, సూర్యాస్తమయ అందాలను ఆస్వాదించారు. రోజువారీ యాంత్రిక జీవనానికి దూరంగా ప్రకృతి మధ్య గడిపిన ఈ సమయం పాల్గొన్న వారికి మధురానుభూతిని అందించింది.ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు షేక్ అలీ మాట్లాడుతూ.. బోథ్ ప్రాంతాన్ని పర్యాటక రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఇక్కడి జలపాతాలు, అటవీ అందాలు, అరుదైన వృక్ష, జంతు జాతుల విశిష్టతను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా పర్యాటకులను ఆకర్షించాలన్నారు. తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో సొసైటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అటవీ శాఖ సహకారంతో ఇప్పటికే పలు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్తులో మరిన్ని వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బద్దం పురుషోత్తం రెడ్డి, గుడిసెల రమణ గౌడ్, వెండి పృథ్వి, అబ్దుల్ రవూఫ్, శ్రీరామోజీ రాజుతో పాటు అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి దామోదర ప్రత్యేక చొరవ

- ముంపు బాధితుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి

- నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ

- ముఖ్యమంత్రి ప్రకటనతో బాధితుల్లో చిగురించిన కొత్త ఆశలు

- మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ నేత కొమ్ము విజయ్‌కుమార్

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :



మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టుల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవ తీసుకోవడంపై కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఉపాధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. నిర్వాసితుల పక్షాన నిలిచి వారి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గత పాలకులు మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టుల నిర్వాసితులకు ఇచ్చిన హామీలను విస్మరించి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. ప్రాజెక్టుల కారణంగా ముంపునకు గురైన కుటుంబాల సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకపోవడం బాధాకరమన్నారు. తమకు న్యాయం చేయాలని నిర్వాసితులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. నవంబర్ 19న సిద్దిపేటలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ముంపు బాధితుల్లో ఒక్కరికి కూడా అన్యాయం జరగకుండా అందరినీ ఆదుకుంటామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హామీతో నిర్వాసితుల్లో కొత్త ఆశలు చిగురించాయని, తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం కలిగిందని అన్నారు. నిర్వాసితుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంలో మంత్రి దామోదర రాజనర్సింహ చూపిన చొరవ అభినందనీయమని విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితులందరికీ న్యాయం జరగాలని ఆకాంక్షించారు.

హరహర మహాదేవ శివనామస్మరణతో మారుమోగిన పల్లెలు

కార్తీక పౌర్ణమి వేడుకలతో శివాలయాల్లో ఆధ్యాత్మిక శోభ

గుర్రంపోడు మండలంలో పలు గ్రామాలలో భక్తుల సందడి ప్రత్యేక పూజలు

రుద్రాభిషేకాలతో శివాలయాలు కళకళ



ప్రజా వాయిస్: గుర్రంపోడు మండలం

నల్గొండ జిల్లా, గుర్రంపోడు మండలంలోని కార్తీక పౌర్ణమి పర్వదినం గుర్రంపోడు మండలంలో భక్తి పారవశ్యాన్ని నింపింది. మండలంలోని పాల్వాయి, గుర్రంపోడు, కొప్పోలు, చామలేడు, కట్టవారిగూడెం, పిట్టలగూడెం గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే శివాలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయాలన్నీ భక్తజన సందడితో కిక్కిరిసిపోయాయి. హరహర మహాదేవ, ఓం నమఃశివాయ నామస్మరణలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.

పాల్వాయిలో ప్రత్యేక పూజలు.. రుద్రాభిషేకాలతో ఆధ్యాత్మిక వైభవం

పాల్వాయి గ్రామంలోని దేవాలయాల్లో గ్రామ పురోహితులు నిమ్మగడ్డ సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ ఆంజనేయస్వామి, పరమశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పాలంకరణతో విశేష అలంకరణలు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు సమర్పించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.365 వత్తుల దీపారాధనకు కార్తీక మాసంలో ప్రత్యేక విశిష్టతఈ సందర్భంగా పురోహితులు నిమ్మగడ్డ సత్యనారాయణ శర్మ కార్తీక మాసం విశిష్టతను భక్తులకు వివరించారు. కార్తీక మాసం పరమశివుడికి అత్యంత ప్రీతికరమైన మాసమని, ఈ మాసంలో చేసే పూజలు, దీపారాధనలు విశేష ఫలితాలను అందిస్తాయని తెలిపారు. కార్తీక పౌర్ణమి రోజున తెల్లవారుజామున పవిత్ర స్నానమాచరించి తులసి, ఉసిరి చెట్ల వద్ద ఆవు నెయ్యి లేదా నువ్వుల నూనెతో 365 వత్తులతో దీపారాధన చేయడం ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. దీపారాధనతో పాటు దానధర్మాలు ఆచరించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని, భగవంతుని కృపకు పాత్రులవుతారని వివరించారు.అనంతరం భక్తులు స్వామివార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, శివస్వాములు, ఆంజనేయస్వాములు, మహిళలు, యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనారు





వరుస చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడి అరెస్టు..

రిమాండ్‌కు తరలింపు!

ప్రజా వాయిస్ / దుబ్బాక

జల్సాల కోసం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని దుబ్బాక పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని దుబ్బాక సీఐ టి. రాజేష్ వెల్లడించారు.దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో ఎస్సై కీర్తి రాజుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. ఈ నెల 20వ తేదీన దుబ్బాక పట్టణంలోని బస్టాండ్‌లో ఉన్న కూల్‌డ్రింక్స్ దుకాణం, బస్టాండ్ పైఅంతస్తులోని ఫ్లెక్సీ దుకాణం, పట్టణ శివారులోని మెకానిక్ దుకాణాల తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ ఘటనల్లో కూల్‌డ్రింక్స్, మొబైల్ ఫోన్, పెన్‌డ్రైవ్, హార్డ్‌డిస్క్, చార్జర్, ప్లంబింగ్ సామగ్రితో పాటు కొంత నగదు అపహరణకు గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి చోరీలకు పాల్పడింది దుబ్బాక పట్టణానికి చెందిన పాత నేరస్తుడు ఎండీ రఫీగా గుర్తించారు. సోమవారం మల్లయ్యపల్లి శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న రఫీని అదుపులోకి తీసుకొని విచారించగా, తానే చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు సీఐ తెలిపారు.నిందితుడి వద్ద నుంచి హార్డ్‌డిస్క్, పెన్‌డ్రైవ్, చార్జర్, ప్లంబింగ్ సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడు ఎండీ రఫీని కోర్టులో హాజరుపరిచి, న్యాయస్థానం ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ టి. రాజేష్ వెల్లడించారు.

పాఠ్యాంశాలలో రాజ్యాంగాన్ని చేర్చాలి..!

- విద్యార్థులకు

- పాఠ్యాంశాలలో రాజ్యాంగాన్ని చేర్చాలి

- బౌద్ధ దమ్మ ప్రచారకులు డాక్టర్ నాగేళ్లి కుమార్

ప్రజా వాయిస్ /దుబ్బాక :

భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాలలో చేర్చి విద్యార్థులకు రాజ్యాంగం పట్ల అవగాహన పెంపొందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బౌద్ధ దమ్మ ప్రచారకులు డాక్టర్ నాగేళ్లి కుమార్ అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ లచ్చపేట గ్రామంలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో 77వ భారత రాజ్యాంగ వేడుకలు పురస్కరించుకొని భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచార ఉద్యమాన్ని సోమవారం నాడు ప్రారంభించారు. లచ్చపేట లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ముందుగా పూలమాలవేసి రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ కుమార్ మాట్లాడుతూ 70 సంవత్సరాల తర్వాత కూడా భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో చేర్చకపోవడం వల్ల రాజ్యాంగం అంటే ఏమిటో విద్యార్థులకు తెలువని పరిస్థితి దాపురించిందన్నారు. ప్రాథమిక పాఠశాల నుండి భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చి విద్యార్థులకు బోధించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ విలువైలై న స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావాన్ని పెంపొందించుకోవలసిన నేటి తరుణంలో కుల వివక్ష,మత ద్వేషం పెంచుతూ రాజ్యాంగం ఆశించిన సోదర భావాన్ని పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ గ్రామీణ ప్రాంతాలే కాక పట్టణ ప్రాంతాల్లో సైతం కుల వివక్ష కొనసాగడం కుల బహిష్కరణ చేయడం రాజ్యాంగం ప్రకారం నేరం అన్నారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అడుగడుగునా పాలకులే ఉ ల్లంగిస్తూ బాబాసాహెబ్ పట్ల విద్వేషాన్ని విరజిమ్ముతున్న మతోన్మాదుల ఆటలు కట్టించాలని భారత రాజ్యాంగం పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 77వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని 2027 జనవరి 26 గణతంత్ర దినోత్సవం వరకు భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచార ఉద్యమాన్ని చేపట్టినట్లు శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లచ్చపేట వార్డు అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఆస రవి, నాయకులు ఇస్తారు గల్ల చంద్రయ్య, బండ నరసింహులు, ఆస దశరథ్, ఇస్తారు గల్ల విజయ్, నరసింహులు, చిరంజీవి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.





మోటకొండూరులో స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం

మోటకొండూరు, నవంబర్ 24(ప్రజా వాయిస్):-

తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ద్వారా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు మరియు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకపు నమోదు కార్యక్రమాన్ని మోటకొండూరు మధిర రాయకుంట పరిధిలోని 12వ వార్డులో సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్, వార్డు సభ్యులు జూకంటి మధు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ. 5 లక్షల ఇందిరమ్మ జీవిత బీమా వర్తిస్తుందని, రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబం దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత కరెంటు, సన్న బియ్యం, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇండ్లు, రైతు రుణమాఫీ, భరోసా, కొత్త పింఛన్లు వంటి సంక్షేమ పథకాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందిస్తోందన్నారు. మోటకొండూరు మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

అట్టుడుకుతున్న ఆలేరు గ్రామపంచాయతీ

కార్యదర్శి వర్సెస్ సర్పంచ్ - తప్పుడు బిల్లులపై సంతకం చేయమని వేధిస్తున్నారని ఫిర్యాదు

ఒత్తిడిల వెనకాల మాజీ బడా నేతలు తలచుకుంటే ట్రాన్స్ఫర్ అవుతావు అని చెప్పి బెదిరింపులు

వచ్చేది మా ప్రభుత్వం ఉద్యోగం ఉంటాదా అంటూ బెదిరింపు

తెలకపల్లి ప్రజా వాయిస్,నవంబర్24

తెలకపల్లి మండలం ఆలేరు గ్రామ పంచాయతీ కార్యదర్శి మాసయ్య, గ్రామ సర్పంచ్ తగిలి ఆనంద్ మరియు ఉప సర్పంచ్ కదిరే మల్లేష్ లపై తీవ్ర ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేశారు.తనను తప్పుడు బిల్లులపై సంతకాలు చేయమని వేధిస్తున్నారని కార్యదర్శి మాసయ్య ఆరోపించారు. గ్రామంలో పలు వీధుల్లో అనేక సమస్యలు ఉన్నప్పటికీ ఆ సమస్యలు పట్టించుకోకుండా, తీర్మానం రాసుకొని పనులు పూర్తి చేయకుండా వాటికి బిల్లులు చేయమని పంచాయతీ సెక్రెటరీగా తనను పలుసార్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెబుతున్నారు.ఈ బిల్లులపై సంతకం చేయకపోతే తనపై రాజ అట్రాసిటీ కేసు పెడతామని బెదిరించారని ఆరోపించారు. తాను ఎస్సీ సర్పంచిని కాబట్టి అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తానని, అబద్ధం చెప్పినా తనను కేసులో ఇరికిస్తానని బెదిరించి 96 వేల రూపాయలు బిల్లు చేసుకొని వచ్చారని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.కనీసం గ్రామపంచాయతీకి సరిగ్గా రాని ఉప సర్పంచ్ కదిరే మల్లేష్ కూడా ఈ తప్పుడు బిల్లులపై సంతకం చేయాలని తనను వేధిస్తున్నారని ఆరోపించారు. ఉప సర్పంచ్ కదిరే మల్లేష్ అచ్చంపేటలో డ్యూటీ చేసుకుంటూ ఏ రోజు బాడీ మీటింగ్ కు రాలేదని, అయినా వచ్చినట్టు సర్పంచ్ తగిలి ఆనంద్ బెదిరించి సంతకాలు పెట్టించారని చెబుతున్నారు. అతనిపై వార్డు నెంబర్ వెంకటయ్య ఫిర్యాదు చేసినా ఇంకా చర్యలు పూర్తి కాలేదని తెలిపారు.సర్పంచ్ తగిలి ఆనంద్ మొదట డబ్బులు విడుదలైనప్పుడు 80 బల్బులు వేసినట్టు, రెండోసారి 100 బల్బులు వేసినట్టు తీర్మానం తీసుకున్నారని, ఆ తర్వాత 60 వేల రూపాయల పనులని తీర్మానం తీసుకున్నారని ఆరోపించారు. ఏఈ గారిని కాంప్రమైజ్ చేసుకుని ఆ బల్బులకు ఐదు లక్షల



నెంబర్లను మాయమాటలు చెప్పి తీసుకెళ్లి తనపై ఫిర్యాదు చేయించారని ఆరోపించారు. అదంతా వాస్తవం కాదని చెబుతున్నారు.కాబట్టి వీళ్లపై పై అధికారులు గ్రామంలో ప్రజల సమక్షంలో పరిశీలించి కఠిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి మాసయ్య, ఆలేరు కోరుతున్నారు.ఈ ఆరోపణలపై సర్పంచ్ తగిలి ఆనంద్, ఉప సర్పంచ్ కదిరే మల్లేష్ ల స్పందన తెలియాల్సి ఉంది.



ఉమ్మడి కొత్తగూడ మండలాల అభివృద్ధే ఏకైక లక్ష్యం.. ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నాం

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం: మంత్రి సీతక్క

ప్రజా వాయిస్ , కొత్తగూడ

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాలుగో వార్డు సభ్యుడు గట్టి వీరస్వామి ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా కొత్తగూడ, గంగారం ఉమ్మడి మండలాలు వెనుకబడిన ప్రాంతాలని, ఉద్యమ సమయంలో ఈ ప్రాంత ప్రజలు తనను కంటికి రెప్పలా కాపాడుకున్నారని గుర్తుచేశారు. ఆనాడు ప్రతి పల్లె, ప్రతి చెట్టు, ప్రతి పుట్ట తిరిగి ప్రజల కష్టాలను దగ్గరగా చూశానని, ఈ ప్రాంత పరిస్థితులపై తనకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ఉమ్మడి కొత్తగూడ మండలాల అభివృద్ధి చేయడమే తన ఏకైక లక్ష్యమని, అందుకే ప్రత్యేక నిధుల ద్వారా వందల కోట్ల రూపాయలు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామని వెల్లడించారు. గతంలో లేని విధంగా నేడు గ్రామగ్రామాన రహదారుల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక భవనాలు నిర్మించడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించడం, ఉచిత విద్య, వైద్య సేవలతో పాటు తాగునీరు, సాగునీటి సౌకర్యాలు కల్పించడం తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన గట్టి వీరస్వామికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ చల్లా నారాయణరెడ్డి, కొత్తగూడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ రూప్‌సింగ్, కొత్తగూడ



బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, మాజీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్, జిల్లా నాయకుడు వీరనేని వెంకటేశ్వర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, నియోజకవర్గ యూత్ ఇన్‌చార్జి మల్లెల రణధీర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పరి కుమార్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కే. ఉపేంద్రాచారి, గుండంపల్లి సర్పంచ్ గట్టి కొమ్మక్క రామస్వామి, దానం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పొలాల వద్ద అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయరాదు

ప్రాణాలకు ముప్పు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

హెచ్చరించిన జిల్లా ఎస్పీ మహేష్ బిగ్ తే

ప్రజా వాయిస్ ఎల్లారెడ్డిపేట/ సిరిసిల్ల

వ్యవసాయ పొలాల వద్ద వన్యప్రాణుల వేట కోసం అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలకు, వన్యప్రాణుల ప్రాణాలకు ముప్పు కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ మహేష్ బి, గితే హెచ్చరించారు వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం, వన్యప్రాణులను చంపడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు.ఇలాంటి ప్రమాదకరమైన చర్యల వల్ల అటవీ జంతువులతో పాటు వ్యవసాయ పనుల నిమిత్తం పొలాల వద్దకు వెళ్లే రైతులు, కూలీలు, పశువులు సైతం ప్రాణాపాయానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు.ప్రజలు ఎవరూ ఇలాంటి అక్రమ చర్యలకు పాల్పడవద్దని, వన్యప్రాణుల వేటగాళ్లు సైతం ఇటువంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు ఎవరైనా అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలకు లేదా వన్యప్రాణుల ప్రాణాలకు హాని కలిగించినట్లు గుర్తిస్తే ఉపేక్షించేది లేదని, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

పాలగుట్టకు పోటెత్తిన భక్తులు

కార్తిక దీపకాంతులతో ఆధ్యాత్మిక శోభ

ఆకట్టుకున్న ప్రభల ప్రదర్శన

జై జై ధ్వనులతో మార్మోగిన పాలగుట్ట ప్రాంతం







జూలూరుపాడు, ప్రజావాయిస్: కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని కాకర్ల పాలగుట్ట పై స్వయంభుగా వెలసిన శ్రీ రుక్మిణి సమేత సంతాన వేణుగోపాల స్వామి గుడికి మంగళవారం భక్తులు పోటెత్తారు. స్థానిక భక్తులతో పాటు, పరిసర ప్రాంత భక్తులు వేకువ జాము నుండే ఆలయం వద్దకు చేరుకొని కార్తిక దీపారాధనతో ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. భక్తుల కార్తీక దీపకాంతులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. తరతరాల సంస్కృతికి అద్దం పడుతూ గ్రామస్తులు రంగురంగుల, రకరకాల, ఆకర్షణీయమైన ప్రభలను భక్తిశ్రద్ధలతో తయారుచేసి, శివసత్తుల పూనకాలు, మేళ తాళాల నడుమ ఎద్ద బండ్లు, ట్రాక్టర్లు, బొలెరో ట్రక్కుల పై శోభాయాత్రగా ఆలయం వద్దకు చేరుకొని ఆలయం చుట్టూ ప్రదర్శన చేశారు. భక్తి పారవశ్యంలో భక్తులు చేసిన జై జై ధ్వనులతో పాలగుట్ట ప్రాంతంతో సహా ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది. కాకర్ల పాలగుట్టపై వెలసిన శ్రీ రుక్మిణి సమేత సంతాన వేణుగోపాల స్వామి ని ఆరాధించడం ద్వారా సంతాన ప్రాప్తి, కుటుంబ సౌభాగ్యం తోపాటు కోరికలు నెరవేరుతాయని ప్రతీతి, దీనికి తోడు కార్తీక పౌర్ణమి పర్వదినం కావడంతో గ్రామస్తులతోపాటు పరిసర ప్రాంత, సుదూర ప్రాంతాల నుండి భక్తులు వేలాదిగా తరలిరావడం విశేషం.



బోర్లు వేసుకునేందుకు ఫారెస్ట్ అధికారుల అడ్డంకులు తొలగించాలి

కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎస్.జె.కె. అహ్మద్

ఎమ్మెల్యే కూనంనేనికి వినతిపత్రం అందజేసిన ఎస్.జె.కె.అహ్మద్

ప్రజా వాయిస్ పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణం పరిధిలోని 7వ డివిజన్ వనమా కాలనీలో ప్రజలు తమ ఇళ్లలో బోర్లు వేసుకొనికుండా ఫారెస్ట్ అధికారులు సృష్టిస్తున్న అడ్డంకులను తొలగించి, అనుమతులు కల్పించాలని కోరుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎస్.జె.కె. అహ్మద్ మంగళవారం కొత్తగూడెంలోని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అహ్మద్ మాట్లాడుతూ వనమా కాలనీలో అనేక ఏళ్లుగా పేద, మధ్యతరగతి కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, ఈ ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వేసవిలో నీటి ఎద్దడి మరింత తీవ్రమవుతోందని, తాగునీటితో పాటు రోజువారీ గృహ అవసరాలకు సైతం సరిపడా నీరు అందక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. స్థానికులు తమ ఇళ్లలో బోర్లు వేయించుకునేందుకు ప్రయత్నించినప్పుడు అటవీశాఖ అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని, బోర్లు వేసేందుకు వచ్చే వాహనాలను సైతం కొన్ని సందర్భాల్లో సీజ్ చేస్తున్నారని తెలిపారు. దీంతో బోర్లు వేసుకునేందుకు అవకాశం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ప్రజల కనీస అవసరమైన తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని, వనమా కాలనీలో స్థానికులు తమ ఇళ్లలో బోర్లు వేసుకునేందుకు శాశ్వత పరిష్కారం చూపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మోటకొండూరులో ఘనంగా కామ్రేడ్ దామేర నరసింహ ప్రథమ వర్ధంతి

మోటకొండూరు, నవంబర్ 24(ప్రజా వాయిస్):-



మోటకొండూరు మండల కేంద్రంలో కామ్రేడ్ దామేర నరసింహ మొదటి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, భవన నిర్మాణ కార్మికుల సంఘం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బీరకాయల మల్లేష్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాదగాని మాణిక్యం మాట్లాడుతూ.. దామేర నరసింహ సీపీఐ పార్టీ పోరాటాలకు, ప్రజానాట్యమండలి పాటలకు ఆకర్షితులై, ప్రజానాట్యమండలి జిల్లా నాయకత్వంగా మరియు సీపీఐ గ్రామ శాఖ కార్యవర్గ సభ్యుడిగా పార్టీ కోసం కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. అనారోగ్యంతో గత ఏడాది ఆయన మరణించడం పార్టీకి, కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. నరసింహ ఆశయ సాధనకై మోటకొండూరు గ్రామ శాఖను మరింత ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు పశువుల నరసింహ, గ్రామ శాఖ సహాయ కార్యదర్శి జీవికలపల్లి పాండు, కార్యవర్గ సభ్యులు బీరకాయల మధు, బోలగాని అశోక్, బీరకాయల పోశయ్య, గట్టికొప్పుల శ్రీధర్, సిద్దుల కుమారస్వామి, వడ్డబోయిన యాదగిరి కుటుంబ సభ్యులు దామర రాధ, బీరకాయల అరుణ, బీరకాయల లావణ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు పెన్షన్, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు జర్నలిస్టుల వినతి.. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ

బెల్లంపల్లి నవంబర్ 24 ప్రజా వాయిస్

ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ, సమాజ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న జర్నలిస్టులకు ఉద్యోగ విరమణ అనంతరం ఆర్థిక భరోసా కల్పించాలని జర్నలిస్టులు కోరారు. జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పించడంతో పాటు ప్రత్యేకంగా జర్నలిస్టుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు సోమవారం రాత్రి బెల్లంపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కలిసి జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల ప్రతిపాదనలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖలకు సిఫారసు చేయాలని కోరారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టులు చురుకుగా పాల్గొని తమ గళాన్ని, కలాన్ని రాష్ట్ర సాధన కోసం వినియోగించారని ఎమ్మెల్యేకు వివరించారు. వివిధ పత్రికలు, టీవీ ఛానళ్లలో



ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టులు పదవీ విరమణ అనంతరం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారికి ప్రభుత్వం అండగా నిలిచి నెలవారీ పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు జారీ చేసే ప్రకటనలతో పాటు అర్హత కలిగిన మీడియా ప్రకటనల ఆదాయంలో 10 శాతం మొత్తాన్ని జర్నలిస్టుల పెన్షన్, సంక్షేమ నిధికి కేటాయించేలా చట్టబద్ధమైన విధానాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల జర్నలిస్టులకు భవిష్యత్తులో ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు వారి కుటుంబాలకు కూడా భరోసా లభిస్తుందని పేర్కొన్నారు.జర్నలిస్టుల వినతిపై ఎమ్మెల్యే గడ్డం వినోద్ సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, జర్నలిస్టులకు పెన్షన్, సంక్షేమ నిధి ఏర్పాటు చేసే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రామ్ శెట్టి వల్లభాయ్, పులియాల రాజు, ఆకుల శివప్రసాద్,కె. శ్రీనివాస్ పూదరి నగేష్ గౌడ్, అందుగుల రమేష్, ఇడిది వేణి రాధాకృష్ణ రావు, బడుగు శ్రీనివాస్, గోండ్ర అనుదీప్, మోహన్, మనోజ్ పాండే, దండబోయిన భాస్కర్, వికాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో ఆస్తుల విధ్వంసమా?

హైకోర్టు ఉత్తర్వులున్నా కూల్చివేతలేంటి?

పెద్దపల్లిలో రోడ్డు విస్తరణపై వ్యాపారుల తీవ్ర అభ్యంతరం.

40 అడుగుల విస్తరణకు సమ్మతి.. కొలతల్లో మాత్రం సమన్యాయం కావాలి.

నోటీసులు, పరిహారం లేకుండానే కూల్చివేతలా?

అధికారుల తీరుపై ప్రశ్నలు.?

చాంబర్ ఆఫ్ కామర్స్ రద్దుకు నిర్ణయం, అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తా - కమల్ కిషోర్ శారదా

ప్రజా వాయిస్, పెద్దపల్లి, నవంబర్ 23

పట్టణ అభివృద్ధి అవసరమే. రహదారుల విస్తరణ కూడా అనివార్యమే. కానీ అభివృద్ధి పేరుతో ప్రజల ఆస్తుల హక్కులకు విఘాతం కలిగితే ఎలా? రోడ్డు విస్తరణలో అందరికీ ఒకే కొలతలు, ఒకే నిబంధనలు వర్తించకపోతే బాధితులకు న్యాయం జరిగేదెలా? పెద్దపల్లి పట్టణంలో ప్రస్తుతం రోడ్డు విస్తరణ వ్యవహారం చుట్టూ ఇవే ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి. హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ అధికారులు కూల్చివేతలకు పాల్పడుతున్నారంటూ వ్యాపారులు చేస్తున్న ఆరోపణలు పట్టణంలో వివాదానికి దారితీశాయి. పెద్దపల్లి పట్టణంలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమల్ కిషోర్ శారదా ఆరోపించారు. మంగళవారం ఆస్తులు కోల్పోతున్న వ్యాపారులు, ఇళ్ల యజమానులతో కలిసి ఆయన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.రోడ్డు విస్తరణకు తాము వ్యతిరేకం కాదని, అయితే విస్తరణ పేరుతో 55 నుంచి 60 అడుగుల మేర ఆస్తులను తొలగించడంపై అభ్యంతరం ఉందని స్పష్టం చేశారు. తొలుత 80 అడుగులు, ఆ తర్వాత 60 అడుగులు, చివరకు 55 అడుగులంటూ అధికారులు చెబుతున్న కొలతల్లో స్పష్టత లేదని విమర్శించారు. రీ-సర్వే నిర్వహించి శాస్త్రీయ పద్ధతిలో కొలతలు నిర్ణయించాలని, ఒక ప్రాంతంలో అనుసరించిన విధానాన్నే మిగతా ప్రాంతాల్లోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు



40 అడుగుల విస్తరణకు అభ్యంతరం లేదు.. మరి ఈ వివాదమెందుకు?

ప్రస్తుతం ఉన్న రహదారిని 40 అడుగుల వరకు విస్తరించేందుకు వ్యాపారులు సిద్ధంగా ఉన్నారని కమల్ కిషోర్ తెలిపారు. రహదారి విస్తరణతో పట్టణానికి ప్రయోజనం కలుగుతుందని, వ్యాపార కార్యకలాపాలకూ అనుకూలత ఏర్పడుతుందని పేర్కొన్నారు. అయితే విస్తరణ పేరుతో కొందరికి ఒక విధంగా, మరికొందరికి మరో విధంగా కొలతలు వర్తింపజేయడం అన్యాయమన్నారు. పోస్టాఫీస్ ఎదురుగా కజ్జపు చంద్రయ్య ఇంటి వద్ద తీసుకున్న కొలతల విధానాన్నే మిగతా ప్రాంతాల్లోనూ అనుసరించాలని కోరారు. ఇప్పటికే కొందరు వ్యాపారులు, ఆస్తుల యజమానులు రహదారి విస్తరణ కోసం స్వచ్ఛందంగా స్థలాన్ని వదులుకున్నారని, అయినప్పటికీ కొలతల విషయంలో స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

నోటీసులు లేకుండా కూల్చివేతలు ఎలా?

ఆస్తులు కోల్పోతున్న వారికి ముందస్తు నోటీసులు, పరిహారం విషయంలో అధికారులు స్పష్టత ఇవ్వాలని కమల్ కిషోర్ డిమాండ్ చేశారు. కోర్టు ఉత్తర్వులు, సంబంధిత చట్టపరమైన ప్రక్రియలను పరిగణనలోకి తీసుకోకుండా కూల్చివేతలు చేపడుతున్నారనేది ఆయన ప్రధాన ఆరోపణ. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో సంబంధిత ఉత్తర్వుల పరిధి ఏమిటి? వాటిని అధికారులు పాటిస్తున్నారా? అన్న అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టే ముందు ఆస్తుల యజమానులకు న్యాయం చేయాలని, నిబంధనల ప్రకారం నోటీసులు, పరిహారం తదితర అంశాలను పరిష్కరించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రశ్నిస్తే పోలీస్ స్టేషన్‌కు పిలిపించారా?

విస్తరణ పనుల్లో జరుగుతున్న తీరును ప్రశ్నించినందుకు తనపై ఒత్తిడి తీసుకొచ్చారని కమల్ కిషోర్ ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ ఫోన్ చేసి పనులను ఎందుకు అడ్డుకుంటున్నావంటూ ప్రశ్నించారని, అనంతరం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అవమానకరంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ప్రజా సమస్యపై ప్రశ్నించడం తప్పెలా అవుతుందని ఆయన నిలదీశారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ వెలువడాల్సి ఉంది.

చాంబర్ ఆఫ్ కామర్స్ రద్దుకు నిర్ణయం

వ్యాపారుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన చాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ పేరును అధికారులు తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటూ, వ్యాపారులు స్వచ్ఛందంగా స్థలాలు ఇచ్చేందుకు అంగీకరించారని ప్రచారం చేయడం సరికాదని కమల్ కిషోర్ అన్నారు. సంస్థ ద్వారా వ్యాపారులకు ఆశించిన న్యాయం చేయలేకపోయాననే బాధతో చాంబర్ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు. రద్దు ప్రక్రియ పూర్తయిన వెంటనే అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తానని వెల్లడించారు.అభివృద్ధి అంటే కేవలం రోడ్ల వెడల్పు పెంచడం మాత్రమే కాదు.. ప్రజల హక్కులు, ఆస్తుల భద్రత, న్యాయబద్ధమైన విధానాలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వడం. పెద్దపల్లిలో రోడ్డు విస్తరణ వివాదానికి తెరపడాలంటే అధికారులు పారదర్శకంగా వ్యవహరించి, కొలతలపై స్పష్టతనిస్తూ బాధితుల అభ్యంతరాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. పట్టణ అభివృద్ధి, ప్రజల ఆస్తుల హక్కులు రెండింటికీ సముచిత న్యాయం జరిగినప్పుడే ఈ విస్తరణకు నిజమైన సార్థకత చేకూరుతుంది. ఈ నిరసన కార్యక్రమంలో అవునూరి కిరణ్, అడిచర్ల రాజవీరు, నంది ప్రకాష్ అటల్, నారాయణదాసు తివారి, ఎల్లంకి సత్యనారాయణ, నార్ల శ్రీనివాస్, అబ్దుల్ మజీద్, ఆదిల్, శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.



కార్తీక పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్‌కు శుభాకాంక్షలు

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీకృష్ణ నగర్, భవానిపురం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు.. చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

ప్రజా వాయిస్ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సూరారం డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణ నగర్, భవానిపురం కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.అనంతరం శ్రీకృష్ణ నగర్, భవానిపురం కాలనీల అభివృద్ధి, స్థానికంగా నెలకొన్న సమస్యలు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కాలనీల్లో రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కాలనీల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కమిటీ సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ నగర్, భవానిపురం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు సంధ్య, కలీం, గణేష్, లక్ష్మణ్, అబ్బాస్, శ్రీనివాస్, సాయి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



మద్ది రామక్క గుట్టపై కార్తీక పౌర్ణమి శోభ.. భక్తజన సందోహం!

వేకువజాము నుంచే శ్రీ దుర్గ మల్లేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు

కన్నులపండువగా జ్వాలా తోరణం, సహస్ర దీపాలంకరణ

మధిరమ్మ చెరువుకు భక్తిశ్రద్ధలతో మహా గంగ హారతి

వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ

పెన్‌పహాడ్, ప్రజా వాయిస్

పెన్‌పహాడ్ మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలోని మద్ది రామక్క గుట్టపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయాల్లో మంగళవారం కార్తీక పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రీ శక్తి శ్రీ శారద పీఠాధిపతులు శ్రీశ్రీ ఆదిత్యానంద స్వామి గురువు పర్యవేక్షణలో, వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా జరిగింది. వేడుకలకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది.కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేకువజాము నుంచే ఆలయ ప్రాంగణం భక్తుల నామస్మరణతో మార్మోగింది. ఉదయం నుండి స్వామివారికి, వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.సాయంత్రం వేళ ఆలయ ఆవరణలో నిర్వహించిన జ్వాలా తోరణం, సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వెయ్యి దీపాల కాంతులతో మద్ది రామక్క గుట్ట పరిసరాలు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. అనంతరం భక్తులు ఊరేగింపుగా మధిరమ్మ చెరువు వద్దకు చేరుకుని, చెరువుకు శాస్త్రోక్తంగా గంగ హారతి సమర్పించారు.ఈ వేడుకలను తిలకించేందుకు ధర్మాపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారతదేశంలో మూడవ అఖండజ్యోతి వేదికగా పాలకుర్తి క్షేత్రం!

తిరువణ్ణామలై అరుణాచలం స్ఫూర్తితో అఖండజ్యోతి ప్రజ్వలన..

భారీ ప్రమిదలో నువ్వుల నూనె, ఆవు నెయ్యి, రెండు క్వింటాళ్ల ముద్ద కర్పూరంతో జ్యోతి వెలిగింపు..

లక్ష దీపోత్సవం, గిరి ప్రదక్షిణలో పాల్గొన్న వేలాదిమంది భక్తులు..



ప్రజా వాయిస్ / పాలకుర్తి /నవంబర్ 24

పాలకుర్తి కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని జనగామ జిల్లా పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మంగళవారం ఆలయ గుట్టపై అఖండజ్యోతి ప్రజ్వలన, లక్ష దీపోత్సవం, గిరి ప్రదక్షిణ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలకు వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

తిరువణ్ణామలై అరుణాచలం స్ఫూర్తితో అఖండజ్యోతి..

తమిళనాడులోని ప్రసిద్ధ తిరువణ్ణామలై అరుణాచలం క్షేత్రంలో నిర్వహించే కార్తీక దీపోత్సవం స్ఫూర్తితో పాలకుర్తి ఆలయ గుట్టపై అఖండజ్యోతిని ఏర్పాటు చేశారు. దక్షిణ భారతదేశంలో అఖండజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మూడవ దేవస్థానంగా పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయం నిలుస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు.

భారీ ప్రమిదలో అఖండజ్యోతి ప్రజ్వలన..

ఆలయ గుట్టపై ప్రత్యేకంగా రూపొందించిన 8 అడుగుల వెడల్పు, 4 అడుగుల ఎత్తు కలిగిన భారీ ప్రమిదలో సుమారు ఒక టన్ను నువ్వుల నూనె, ఆవు నెయ్యి, రెండు క్వింటాళ్ల ముద్ద కర్పూరాన్ని ఉపయోగించి అఖండజ్యోతిని వెలిగించారు. సాయంత్రం 6 గంటలకు వేలాదిమంది భక్తుల సమక్షంలో అఖండజ్యోతి ప్రజ్వలన కార్యక్రమం భక్తిపారవశ్యంతో జరిగింది.

లక్ష దీపోత్సవం.. గిరి ప్రదక్షిణతో ఆధ్యాత్మిక సందడి..

కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన లక్ష దీపోత్సవం, గిరి ప్రదక్షిణ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీపాల వెలుగులతో ఆలయ పరిసరాలు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. భక్తుల శివనామస్మరణలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాలకుర్తి క్షేత్రం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. అఖండజ్యోతి దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.ఈ కార్యక్రమం లో ఆలయ ఈవో లక్ష్మీ ప్రసన్న ఆలయ అర్చకులు ఆలయ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతే లక్ష్యంగా గ్రామాల్లో విస్తృత తనిఖీలు

చిన్న ఎల్లాపూర్‌లో గుడూరు పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

- 150 ఇళ్లలో తనిఖీలు.. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 20 వాహనాల గుర్తింపు

- 15 లీటర్ల గుడుంబా స్వాధీనం.. 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

- రోడ్డు భద్రత, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన



ప్రజా వాయిస్, గూడూరు:

గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా గూడూరు పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఆదేశాల మేరకు గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న ఎల్లాపూర్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు.గురువారం ఉదయం 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు గూడూరు సీఐ వినయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసులు గ్రామంలోని సుమారు 150 ఇళ్లను తనిఖీ చేశారు. వాహనాలు, అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై క్షుణ్ణంగా పరిశీలన చేపట్టారు.ఈ తనిఖీల్లో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 20 వాహనాలను గుర్తించారు. అక్రమంగా తయారు చేస్తున్న 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతో పాటు, సుమారు 800 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు.అనంతరం గ్రామస్థులకు రోడ్డు భద్రతా నియమాలు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు అవగాహన కల్పించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని సీఐ వినయ్ సూచించారు.జిల్లాలో నేరాల నియంత్రణ, అక్రమ మద్యం తయారీ నిర్మూలన, మాదకద్రవ్యాల కట్టడికి నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని ఎస్పీ డాక్టర్ శబరీష్ స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హేమాద్రిలో ఘనంగా కార్తీకపౌర్ణమి వేడుకలు

కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని వైభవంగా గిరి ప్రదక్షిణ మహోత్సవం

వేలాది మంది భక్త జనసందోహంలో అంగరంగ వైభవంగా గిరి ప్రదక్షిణ

ప్రముఖ ప్రవచనకర్త శ్రీ మాచిరాజు కిరణ్ కుమార్ భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు

ప్రజావాయిస్, కీసర :

రంపల్లిదయరా వెంకులోనిగుట్ట లో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన స్వామివారి గిరి ప్రదక్షిణ మహోత్సవం వేలాది మంది భక్తుల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు..

కార్తీక మాస పవిత్రతను చాటుతూ, ఈ మహోత్సవంలో అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి పట్ల తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. స్వామివారిని పల్లకి మోస్తూ భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొనడంతో హేమాద్రి క్షేత్రం అంతా భక్తి పారవశ్యంతో, ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.

ఈ సందర్భంగా ప్రముఖ ప్రవచనకర్త శ్రీ మాచిరాజు కిరణ్ కుమార్ గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. ఆయన ప్రవచనాలు భక్తులను ఆధ్యాత్మిక చింతనలో మునిగిపోయేలా చేశాయి.

అదేవిధంగా సాయంత్రం వేళ కార్తీక దీపోత్సవం మరియు లింగాష్టక కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. దీపాల వెలుగులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ మహోత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులందరికీ హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు..

ఈ సందర్భంగా దేవస్థాన ట్రస్ట్ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి మరియు ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ, భక్తులందరి సహకారంతో కార్తీక పౌర్ణమి మహోత్సవం విజయవంతంగా నిర్వహించబడిందని, భవిష్యత్తులో కూడా మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తుల



భాగస్వామ్యంతో నిర్వహిస్తామని తెలిపారు....

శివాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం..

భక్తులతో కిటకిటలాడుతున్న దేవాలయాలు..

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి



ఎల్కతుర్తి గ్రామ శివాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా పూజారులు నందనం రవి, మణికంఠ శర్మ రాహుల్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నాలుగు గంటల నుండి అర్చనలు, పంచ అమృతాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు, అనంతరం ఆలయంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తులు సామూహికంగా నిర్వహించారు. ప్రదోషకాలంలో ఆకాశ దీపారాధన, అఖండ దీపారాధన మరియు జ్వాలాతోరణం అత్యంత వైభవోపేతంగా జరిగింది.

అఖండ దీపారాధన దర్శించిన ప్రతి ప్రాణికి పునర్జన్మ లేకుండా పరమేశ్వరునిలో ఐక్యమైపోతారని పురాణం చెప్తుంది. జ్వాలాతోరణ దర్శనం దానికింద నుంచి దాటడం వల్ల పాపాలు, అపమృత్యు దోషాలు తొలగి ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల ప్రగడంగా విశ్వసిస్తారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మునిగడప లావణ్య శేషు, సీనియర్ ఆంధ్రప్రభ జర్నలిస్ట్ జనగాని ప్రవీణ్ గౌడ్, శ్రీనివాస్ సేటు, కొమురవెల్లి వెంకటేశ్వర్లు, జయప్రసాద్, కొమురవెల్లిసతీష్, నరసింహస్వామి, దేవరాజ్, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ ప్రజలను మోసం చేస్తున్నాయి:వంటేరు

- **రేవంత్‌రెడ్డి సభల్లో కేసీఆర్‌పై విమర్శలే ప్రధాన అజెండా**
- **తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వని మోదీ ప్రభుత్వం**
- **రైతులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?**
- **కేసీఆర్ హయాంలోనే అనేక సంక్షేమ పథకాల అమలు**
- **మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం**
- **గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి**



ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అసత్య ప్రచారాలతో మోసం చేస్తున్నాయని గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించి బహిరంగ సభలు, పాదయాత్రల పేరుతో రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. గ్రామాల్లో ప్రజలు కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, బీజేపీ ఉనికిని కోల్పోయిందని విమర్శించారు. ఐదు లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదని, రేవంత్‌రెడ్డి బహిరంగ సభల్లో కేసీఆర్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని, బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించలేదని, పదేళ్లుగా ప్రాంతీయ రింగ్ రోడ్డు పనులను పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. పాదయాత్రల పేరుతో బీజేపీ కుల, మత రాజకీయాలు చేస్తూ ప్రజలను మోసం చేయాలని చూస్తోందన్నారు. తెలంగాణ కోసం 1,200 మంది ప్రాణత్యాగాలు చేయడానికి సోనియాగాంధీనే కారణమని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో 24 గంటల విద్యుత్, కల్యాణలక్ష్మి, రైతుబీమా, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, చేపలు, గొర్రెల పంపిణీ, రైతుబంధు, దళితబంధు, బీసీబంధు, మైనార్టీబంధు వంటి పథకాలతో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయడం దారుణమన్నారు. మోదీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, రేవంత్‌రెడ్డి ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి యువత, విద్యార్థులను మోసం చేశారని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, బంగారం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డిని మోదీ ప్రభుత్వం కాపాడుతోందని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై సీబీఐ కేసులున్నా కేంద్రం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. మోదీ, రేవంత్‌రెడ్డి కుమ్మక్కై తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని రాజకీయాలు చేసినా ప్రజల మద్దతు కేసీఆర్, బీఆర్ఎస్ వైపే ఉందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.సి. రాజమౌళి, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, దేవి రవీందర్, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, కొండపాక మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, కృష్ణారెడ్డి, మద్ది రాజిరెడ్డి, తూప్రాన్ మాజీ జడ్పీటీసీ రాణి సత్యనారాయణగౌడ్, గంగిశెట్టి రవీందర్, కుమ్మరి రఘుపతి, దుర్గాప్రసాద్, ప్రభాకర్, అహ్మద్, నిజాం, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ బాధితురాలికి కాటిపల్లి శ్రీకర్ రెడ్డి ట్రస్ట్ ఆర్థిక చేయూత

రామారావుపల్లె గ్రామంలో రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేసిన ట్రస్ట్ అధినేత శ్రీనివాస్ రెడ్డి



ప్రజా వాయిస్, మెట్‌పల్లి:

ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ కాటిపల్లి శ్రీకర్ రెడ్డి ట్రస్ట్ తన సేవా దృక్పథాన్ని మరోసారి చాటుకుంది. మెట్‌పల్లి మండలంలోని రామారావుపల్లె గ్రామానికి చెందిన గుంట సావిత్రి గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న కాటిపల్లి శ్రీకర్ రెడ్డి ట్రస్ట్ అధినేత కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించారు. మంగళవారం రామారావుపల్లె గ్రామంలోని బాధితురాలి నివాసానికి వెళ్లి, ఆమె వైద్య ఖర్చులు మరియు డయాలసిస్ చికిత్స నిమిత్తం పది వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని నగదు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధినేత కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్య మరియు ఆర్థిక అవసరాలకు తమ ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆపత్కాలంలో తమ కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకున్న శ్రీనివాస్ రెడ్డికి బాధితురాలు గుంట సావిత్రి, ఆమె కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు మరియు ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





దీక్షలో ఉన్న స్వాములకు అన్నదానం

అయ్యప్ప స్వాముల సేవలో రమేష్ నాయుడు బ్రదర్స్

ప్రజా వాయిస్, కోదాడ:

పట్టణంలోని విజయనగర్ బైపాస్ మెయిన్ రోడ్డులో అయ్యప్ప దేవాలయం సమీపంలో రమేష్ నాయుడు బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం భక్తులకు సేవాభావాన్ని చాటుతోంది. ఇందులో భాగంగా మంగళవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు నాగిరెడ్డి శ్రీధర్, భవాని దంపతులు అన్నదాన కార్యక్రమానికి సహకరించారు. సీనియర్ గురుస్వామి గాలి శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ ప్రత్యేక పూజల అనంతరం అయ్యప్ప స్వాములతో పాటు వివిధ రకాల దీక్షల్లో ఉన్న స్వాములకు అన్నప్రసాద వితరణ చేసినట్లు తలిపారు. ఈ కార్యక్రమంలో బర్మవత్ సీతారాం సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి సందర్భంగా వల్మిడి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో పోటెత్తిన భక్తులు!

ఒకే గుట్టపై శ్రీ రామలింగేశ్వర స్వామి మరియు శ్రీ సీతారామచంద్ర స్వామివార్ల దర్శనం.. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, పాలాభిషేకాలు.

ప్రజా వాయిస్ /పాలకుర్తి/నవంబర్ 24



కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని జనగామ జిల్లా, పాలకుర్తి మండలం, వల్మిడి గ్రామంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీ రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు..

కార్తీక పౌర్ణమి సందర్భంగా గుట్టపై కొలువై ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. భక్తిశ్రద్ధలతో పాలాభిషేకాలు నిర్వహించి, పుష్పాలు, బిల్వదళాలతో స్వామివారిని పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది.

ఒకే గుట్టపై శివకేశవుల దర్శనం ప్రత్యేక ఆకర్షణ..

వల్మిడి గుట్టపై శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామివారు కొలువై ఉండటం ఈ క్షేత్రం ప్రత్యేకతగా నిలుస్తోంది. ఒకే గుట్టపై శివకేశవుల దర్శనం లభించడం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించింది. కార్తీక పౌర్ణమి పర్వదినాన స్వామివార్లను దర్శించుకోవడానికి పరిసర గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఆలయంలో భక్తి, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు స్వామివార్ల కృపాకటాక్షాలు పొందాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సోనాల మండలంలో శిక్షణ ఐపిఎస్ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన

పత్తి జిన్నింగ్ మిల్లు, బీడీ పరిశ్రమలను సందర్శించి స్థానిక ఉపాధి, వ్యాపార వివరాల సేకరణ

పాడికే ఆదివాసీ ఆవాసంలోని పంచముఖ హనుమాన్ ఆలయ దర్శనం, గిరిజనుల జీవన స్థితిగతులపై ఆరా

ప్రజా వాయిస్,/ ఆదిలాబాద్ / బోథ్ నియోజకవర్గం

క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా శిక్షణ ఐపిఎస్ అధికారులు మంగళవారం సోనాల మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా మండల కేంద్రంలోని పత్తి జిన్నింగ్ పరిశ్రమను సందర్శించిన అధికారులు, పత్తి కొనుగోలు ప్రక్రియ, నాణ్యత ప్రమాణాలు, ముడిసరుకు శుద్ధి విధానాలపై నిర్వాహకులను అడిగి సమగ్ర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సోనాల గ్రామ పంచాయతీ పరిధిలోని చార్ బై బీడీ కంపెనీని సందర్శించి, స్థానిక కార్మికులకు అందుతున్న ఉపాధి అవకాశాలు, పని విధానాలను పరిశీలించారు.తదుపరి పర్యటనలో భాగంగా మండలంలోని పాడికే గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజన ఆవాస ప్రాంతానికి చేరుకున్న అధికారులు, అక్కడి పంచముఖ హనుమాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత గ్రామంలోని ఓ ఆదివాసీ కుటుంబాన్ని నేరుగా కలిసి వారి జీవన విధానం, సామాజిక ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులపై ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు.



సేవాలాల్ మహారాజ్ ఆలయ శంకుస్థాపనకు దేవరకొండ నుంచి 10 వేల మంది తరలిరావాలి

100 బస్సులతో పాటు సొంత వాహనాల్లోనూ భారీగా తరలిరావాలి

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ శ్రేణులకు ఎమ్మెల్యే బాలు నాయక్ పిలుపు

ప్రజా వాయిస్ / దేవరకొండ:

బంజారా సోదరుల ఆరాధ్య దైవం, ఆధ్యాత్మిక గురువు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంతో పాటు విగ్రహ నిర్మాణానికి ఈ నెల 26వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా మద్దిమడుగులో నిర్వహించనున్న శంకుస్థాపన కార్యక్రమానికి దేవరకొండ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జరగనున్న శంకుస్థాపన కార్యక్రమంతో పాటు అచ్చంపేట నియోజకవర్గంలోని హాజీపూర్ వద్ద నిర్వహించనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభకు దేవరకొండ నియోజకవర్గం నుంచి 100 బస్సులతో పాటు సొంత వాహనాల్లో సుమారు 10 వేల మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని ఎమ్మెల్యే కోరారు.నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బంజారా సోదరులు, అభిమానులు సమన్వయంతో వ్యవహరించి పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





డబ్బు రెట్టింపు పేరిట ఘరానా మోసం

నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులు

రూ.40 లక్షల విలువైన ఆటబొమ్మల నోట్లు, 100 నకిలీ బంగారు నాణేల స్వాధీనం.

మంత్రతంత్రాల మాయమాటలతో దాదాపు 40 మందిని బురిడీ కొట్టించిన నలుగురు నిందితుల అరెస్ట్

ప్రజా వాయిస్, /ఆదిలాబాద్

మంత్రతంత్రాలు, పూజల పేరుతో డబ్బు రెట్టింపు చేస్తామంటూ అమాయకులకు 'చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' నోట్లు అంటగడుతున్న ఘరానా ముఠా గుట్టును ఆదిలాబాద్ పోలీసులు మంగళవారం రట్టు చేశారు. మంచిర్యాల జిల్లాకు చెందిన పత్తి రాములు అనే వ్యక్తి వద్ద విడతల వారీగా రూ.8 లక్షలు వసూలు చేసిన అత్రం పరశురామ్, పది రోజుల తర్వాత తెరవాలని ఓ సంచిని అప్పగించాడు. గడువు తీరాక సంచి తెరిచి చూడగా కట్టలకు పైనా కిందా అసలు నోట్లు ఉంచి, మధ్యలో ఆటబొమ్మల నోట్లు, తెల్ల కాగితాలు పెట్టినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన రక్షకభటులు దర్యాప్తు చేపట్టి ముఠా సభ్యులైన ఎంబడి మల్లేష్, చీటి తరుణ్, సాయి కృష్ణ, పెంద్రం సురేష్‌లను అదుపులోకి తీసుకున్నారు.అరెస్టయిన నిందితుల వద్ద నుంచి వివిధ విలువలు కలిగిన 99 కట్టల (రూ.40 లక్షల విలువైన) నకిలీ నోట్లు, 100 నకిలీ బంగారు నాణేలు మరియు మూడు చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులు అత్రం పరశురామ్, మండలి బక్కన్న ఇప్పటికే మరో కేసులో కటకటాల వెనుక ఉన్నట్లు జిల్లా పోలీసు అధికారి (ఎస్పీ) అఖిల్ మహాజన్ వెల్లడించారు. ఈ ముఠాపై హైదరాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లోనూ కేసులు ఉన్నాయని, సుమారు 40 మందికి పైగా వీరి చేతిలో మోసపోయి ఉంటారని తెలిపారు. అత్యాశకు పోయి మాయగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దని, బాధితులు ఎవరైనా ఉంటే నిర్భయంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.

నీళ్లు మోస్తూ చదివి.. న్యాయవాదిగా ఎదిగి.!

పేదరికాన్ని జయించి హైకోర్టులో అడుగుపెట్టిన బాలాజీనగర్ యువకుడు

ఇంటింటికీ నీటి సరఫరా చేస్తూ చదువు

గ్రంథాలయంలో పనిచేస్తూనే ఉన్నత విద్య

కుటుంబంలో తొలి న్యాయవాదిగా

నరేందర్ నాయక్

యువతకు ఆదర్శంగా నిలిచిన విజయప్రస్థానం







ప్రజా వాయిస్, కోదాడ:

పేదరికం ప్రతిభకు అడ్డుకాదని నిరూపించారు బాలాజీనగర్‌కు చెందిన బర్మావత్ నరేందర్ నాయక్. ఒకవైపు ఇంటింటికీ మంచినీళ్ల సరఫరా చేస్తూ.. మరోవైపు గ్రంథాలయంలో విధులు నిర్వహిస్తూ ఉన్నత విద్యను అభ్యసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పలు పట్టాలు పొందిన ఆయన.. కేశవ్ మెమోరియల్ న్యాయ కళాశాలలో న్యాయశాస్త్రం పూర్తి చేశారు. తాజాగా తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా అధికారికంగా నమోదయ్యారు. కుటుంబంలో తొలి లాయర్‌గా గుర్తింపు పొందారు. విద్యార్థి నాయకుడిగా గిరిజన హక్కుల కోసం పోరాడిన ఆయన ప్రస్థానం నేటి యువతకు స్ఫూర్తిదాయకం. కష్టపడితే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని నిరూపించిన నరేందర్ నాయక్‌పై బాలాజీనగర్‌లో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

మండల వ్యాప్తంగా ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

బేతవోలు, జెర్రిపోతుల గూడెం, నారాయణపురం,రామాపురం తదితర గ్రామాల్లో దీపకాంతులతో వెలిగిపోయిన ఆలయాలు

ప్రజా వాయిస్, చిలుకూరు, నవంబర్ 24 :

చిలుకూరు మండలంలో కార్తీక పౌర్ణమి వేడుకలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. మండలంలోని బేతవోలు, జరిపోతుల గూడెం, నారాయణపురం, రామాపురం తదితర వివిధ గ్రామాల్లోని ఆలయాలు దీపకాంతులతో శోభాయమానంగా కనిపించాయి.తెల్లవారుజాము నుంచే మహిళలు కార్తీక స్నానాలు ఆచరించి, దీపాలు పట్టుకుని ఆలయాలకు చేరుకున్నారు. భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేసి, ఉసిరి చెట్టు కింద దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.



బేతవోలులో:బేతవోలు గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దీపార్చనలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జెర్రి పోతుల గూడెంలో:జెర్రిపోతుల గూడెం గ్రామంలో కూడా కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు చేసి, దీపార్చనలు నిర్వహించారు. గ్రామ మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నారాయణపురంలో:నారాయణపురం గ్రామంలోని ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

రామాపురంలో:రామాపురం గ్రామంలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ చైర్మన్ నిగడాల వీరయ్య ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, దీపార్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేమూరి కృష్ణయ్య, సాదే నాగేశ్వరరావు, వేమూరి వెంకటేష్ తో పాటు గ్రామ ప్రజలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.మండల కేంద్రం చిలుకూరుతో పాటు మండలంలోని మిగిలిన అన్ని గ్రామాల్లో కూడా కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్తీక మాసం సందర్భంగా వనభోజనాలు చేసి ఘనంగా జరుపుకున్నారు.

కార్తీక మాస శోభ.. ఏడుపాయల్లో పోటెత్తిన భక్తులు!







ప్రజా వాయిస్,పాపన్నపేట

పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పాపన్నపేట మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వనదుర్గా భవానీ మాత ఆలయం భక్తుల సందడితో కిటకిటలాడుతోంది. కార్తీక పౌర్ణమి మరియు వైకుంఠ చతుర్దశి పర్వదినం కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.మెదక్ జిల్లా నుంచే కాకుండా సంగారెడ్డి, హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున విచ్చేశారు. భక్తులు ముందుగా మంజీరా నదీ పాయల్లో పవిత్ర స్నానాలు ఆచరించి, అనంతరం క్యూలైన్లలో వేచి ఉండి వనదుర్గా భవానీ మాతను దర్శించుకున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు, దీపారాధన:

మహిళలు భక్తిశ్రద్ధలతో నదీ తీరంలో మరియు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి, అమ్మవారికి ఒడిబియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అర్చకులు తెల్లవారుజాము నుంచే అమ్మవారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ మరియు కుంకుమార్చనలు నిర్వహించారు.

కార్తీక మాసం సందర్భంగా ఆలయ పరిసరాలన్నీ "ఓం శ్రీ మాత్రే నమః", "జై దుర్గా భవానీ" నామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

భక్తులకు ఏర్పాట్లు:

కార్తీక పౌర్ణమి కావడంతో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని ముందే ఊహించిన ఆలయ అధికారులు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు మరియు పారిశుద్ధ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏడుపాయల కార్యనిర్వహణ అధికారి, మరియు ఏడుపాయల సిబ్బంది, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు




కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి.. మంథనిలో పుట్ట మధుకర్ ఎమ్మెల్యే కావాలి..

- అరుణాచలంలో భిక్షాటన చేస్తూ మొక్కు చెల్లించుకున్న మంథని బీఆర్ఎస్ నాయకులు..

- కార్తీక పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలేశ్వరుడికి ప్రత్యేక ప్రార్థనలు

ప్రజా వాయిస్ మంథని

తెలంగాణ రాష్ట్రానికి తిరిగి పూర్వవైభవం రావాలని, 2028-29 ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని, మంథని నియోజకవర్గం నుంచి పుట్ట మధుకర్ ఎమ్మెల్యేగా విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ మంథనికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు అరుణాచలంలో భిక్షాటన చేస్తూ మొక్కు చెల్లించుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా అరుణాచలంలో గిరిప్రదక్షిణతో పాటు కొండపై జ్యోతి వెలిగించే పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని అరుణాచలేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తమ రాజకీయ ఆకాంక్షలు నెరవేరాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగిందని, తిరిగి ఆయన ముఖ్యమంత్రి అయితే రాష్ట్రానికి పూర్వవైభవం వస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు, యువతతో పాటు వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తొలగిపోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మంథని నియోజకవర్గంలో పుట్ట మధుకర్ ఎమ్మెల్యేగా గెలుపొందాలని, నియోజకవర్గ అభివృద్ధికి మరింత అవకాశం కలగాలని అరుణాచలేశ్వరుడిని వేడుకుంటూ భిక్షాటన ద్వారా మొక్కు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంథని మాజీ యువజన అధ్యక్షుడు కొండ రవీందర్, పెంచికల్‌పేట మాజీ సర్పంచ్ కొండ వెంకటేష్, అక్కేపల్లి మాజీ ఎంపీటీసీ పెగడ శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బడికెల సతీష్ పాల్గొన్నారు.



మద్దిమడుగుకు సీఎం రేవంత్ రెడ్డి - పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజా వాయిస్ నాగర్ కర్నూలు, నవంబర్ 24 :

ఈ నెల 26న నాగర్ కర్నూల్ జిల్లా మద్దిమడుగుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ శంకుస్థాపన, మద్దిమడుగు ఆంజనేయస్వామి దర్శనం కోసం సీఎం పర్యటన ఖరారైంది.ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెలిప్యాడ్, ఆలయ పరిసరాలు, శంకుస్థాపన ప్రదేశం, సభా ప్రాంగణాన్ని వారు పరిశీలించారు.సుమారు 5 వేల మందికి పైగా గిరిజనులతో సీఎం ముఖాముఖి కార్యక్రమం ఉండనుంది. వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో గిరిజనులు హాజరుకానున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, వాహనాల పార్కింగ్ పై అధికారులకు సూచనలు ఇచ్చారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు.భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సంగ్రామ్ సింగ్ సూచించారు.సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ శంకుస్థాపనకు పెద్ద సంఖ్యలో గిరిజనులు తరలిరానున్నారని ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ముందస్తు ప్రణాళికతో అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రతి కార్యకర్తకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుంది

పలు కుటుంబాలను పరామర్శించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్

ప్రజా వాయిస్ / కేసముద్రం:

కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ అన్నారు.మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు మేడి ఉపేందర్ గౌడ్, వెంకటేశ్వర్లు గౌడ్‌ల తండ్రి మేడి జీడయ్య గౌడ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న సమ్మయ్య గౌడ్ గ్రామానికి చేరుకున్నారు. స్థానిక సర్పంచ్ యాసాడి బాలాజీ రెడ్డి, గ్రామ నాయకులతో కలిసి జీడయ్య గౌడ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం కుటుంబ సభ్యులను, ఇద్దరు కుమారులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.అదేవిధంగా అదే గ్రామానికి చెందిన అంబటి వెంకన్న యాదవ్ తల్లి అంబటి ఎల్లమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాసాడి బాలాజీ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు సట్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మేడి ఉపేందర్, మాజీ సర్పంచ్ నాగేల్లి శ్రీను, భూలోక్ రెడ్డి, నాగేల్లి వెంకటస్వామి, సమానపల్లి యాకయ్య, ఎడ్ల రవి, మందుల మధు, గాదెగోని నరేష్, మడిపెల్లి నాగరాజు తదితర గ్రామ కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.